

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(మంగళవారం)
కనిష్ఠం : 29

మడికి అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్ సమయాల్లో మార్పు 7



డిస్పోజబుల్!

ప్రజారోగ్యంపై ప్లాస్టిక్ భూతం

ఇలా తెచ్చినా ప్రమాదమే సుమా : ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయాలు

ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడతారు.. ప్రస్తుత తరానికి ఈ సామెత అతికినట్టు సరి పోతోంది.. అనువుగా ఉంది కదా అని వినియోగానికి ప్లాస్టిక్ అనే గొయ్యి తవ్వుకున్నారు.. ప్రస్తుతం అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారు.. అలాగని వదల్లేకపోతున్నారు..కేన్సర్ వంటి మహమ్మారి చుట్టుముడుతున్నా అదే తీరు.. మార్పు కానరావడంలేదు.. ఒకనాడు జనా వాసంలో ప్లాస్టిక్ వినియోగం లేదు.. క్యాన్సర్ కేసులు లేవు..ప్రస్తుతం వినియోగం పెరిగింది.. టీ తాగే కప్ నుంచి భోజనం చేసే ప్లేట్ వరకూ అంతా ప్లాస్టిక్కే.. దీంతో రకరకాల క్యాన్సర్ కేసు లు జనంపై దాడులు చేస్తున్నాయి.. చిన్న వయ సులోనే ప్రాణాలు తీస్తోంది.. అయినా మన జీవ న విధానంలో మార్పురావడంలేదు.. నేను ఆరోగ్యంపై చాలా శ్రద్ధ తీసుకుంటాను..నాకెలా క్యాన్సర్ వచ్చిందనే వాళ్లు ఒకసారి ఆలోచిస్తే అసలు కథ బోధపడుతుంది.. ఇకనైనా మారాల్సిందే.. ప్లాస్టిక్ వదిలేయాల్సిందే.. - (రాజమహేంద్రవరం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)



చూశారా.. చిత్రం : కాకినాడ దమ్ములపేట వద్ద డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- అరికట్టలేకపోతున్న అధికార గణం
- రోగాలకు గురవుతున్న జనం
- క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- రోజుకు 300 టన్నుల వ్యర్థాలు
- డంపింగ్‌యార్డుల నిండా అదే

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది.ప్రజారోగ్యాన్ని పీల్చిపిప్పి చేస్తోంది.ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని ఎన్ని అవగాహన కార్యక్రమాలు సాగుతున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మార్పు రావడం లేదు. ఇక వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు.దీంతో ప్లాస్టిక్ వినియోగం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిపోతోంది. ప్లాస్టిక్‌ను స్థానిక సంస్థలు నిషేధించినా.. అమలులో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. కిందిస్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా మారి పోయింది. దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి.

ప్లాస్టిక్ వదిలేద్దాం!

ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి పదేళ్లు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అనంతం. అందువల్ల పాలిథీన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాల్సిందే. ఇవాళ పాలి థీన్ సంచి అవసరమైతే చిన్న కిళ్లీ బడ్డీలో కూడా దొరుకుతుంది. నార సంచి కావాలంటే వెతుకు లాడాల్సిందే.ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వాటిని ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్, జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళా దుంప నుంచి తీసే పిండి బయో పాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్ది రోజులకే భూమిలో కలిసి పోవడం వల్ల పర్యావరణానికి హాని ఉండదు. ఇలాంటి ప్రత్యా మ్నాయాలపై తక్షణమే దృష్టి సారించాలి.

టీ కప్‌లో తుఫాన్..

ప్లాస్టిక్ టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీని పాలిథీన్ కవర్లలో వేస్తున్నారు.దాని వల్ల పాలిథీన్ కవర్ కరిగి ఆ టీలో కలిసిపోతుంది. అది తాగిన వారికి కొన్ని రోజులకు కాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్‌లో తాగినా ప్లాస్టిక్ ఉంటుంది.

క్యాన్సర్ కొనితెచ్చుకుంటున్నాం..

రోజులో మన వాడకాల్లో సగానికిపైగా ప్లాస్టిక్ భూతమే ఉంటోంది.పర్యావరణం,ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు రకరకాల క్యాన్సర్లకి కారణమవుతూ కుటుంబాల్లో ప్రళయాన్ని సృష్టిస్తున్నాయి.75 మైక్రాన్లలోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు.75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న పాలిథీన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు.వీటిని నియంత్రించిన అధికారు లు చోద్యం చూస్తున్నారు. ప్రజలు వినియోగించిన పాలిథీన్ కవర్లను రోడ్లపై వేయడంతో అవి మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయని జంతుప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ సర్వే మాట

మనం వాడి పడేస్తు న్నాం.. మనకేంటి.. అని సంబర పడుతుంటే ప్లాస్టిక్ వ్యర్థాల్లో కాలు వేసి నట్లే. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు, టీ తదితర ఆహార పదార్థాలు తీసుకురావడం. ప్యాకేజింగ్‌కి ప్లాస్టిక్ సంచులను వాడడం, ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారు చేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని విని యోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రం గులు రావడానికి ఎన్నో రసాయనాలు కలు పుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూల తలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదు గుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల దారుణ రుగ్మతల బారిన పడుతున్నామని వివిధ సర్వేలు చెవిలో పోరు పెడుతేన్నాయి.

ఉమ్మడి జిల్లాలో 300 టన్నులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రోజుకు సగటున 600 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 300టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. ఎక్కడైనా డంపింగ్‌యార్డ్‌వద్దకు వెళ్లి చూస్తే ప్లాస్టిక్ కనిపించకుండా చెత్త ఉండదు.హోల్‌సేల్ దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళ్తున్నాయని ఓ అంచనా. స్వచ్ఛభారత్ వంటి పురస్కారాలకోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాలలెక్కను తొక్కిపడుతున్నారనే విమర్శలున్నాయి.



కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆర్‌అండ్‌బీ రహదారి

దారి మారు!

రహదారులపై కోట్లు పోస్తున్న ప్రభుత్వం

- అన్ని దారుల వైపు చూపు
- రోడ్లపై సాఫీగా ప్రయాణం
- 10 నెలల్లో రోడ్లు బాగుబాగు
- నాబార్డు నిధులు విడుదల
- 16 రోడ్లకు 29.92 కోట్లు

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ.200కోట్లకుపైగా విడుదల చేసింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని 39 పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ.73.15కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలో 76.188 కిలోమీటర్ల పొడవునగల 16రహదారుల అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.29.92కోట్లను విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.ఈ మేరకు టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాకాలంనాటికి రాష్ట్రంలో రహదారులపై ఎక్కడ గుంతలు కనబడకూడదని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దిష్టంగా ఆదేశాలిచ్చారు. ఆర్‌అండ్‌బీశాఖ తాత్కాలిక, శాశ్వత కార్యాచరణలు సిద్ధం చేసుకుని తదనుగుణంగా పనులు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రహదారుల మరమ్మతుల పనులు చేపట్టి 75శాతం వరకూ పూర్తి చేసింది. మిగిలిన పనులు వర్షాలు రాకుండా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కాకినాడకు రూ.13.20 కోట్లు

- నాబార్డు ఆర్ఐడీఎఫ్ 30వ విడత ద్వారా కాకినాడ జిల్లాలో 37.516 కిలోమీటర్ల పొడవుగల 6రహదారుల అభివృద్ధికి రూ.13.20 కోట్లు మంజూరు చేశారు. తిప్పరాజుపాలెం-కాజులూరురోడ్డుకు రూ.3.10కోట్లు, రావికంపాడు-రమణక్కపేట రోడ్డుకు రూ.2కోట్లు, యండపల్లి జంక్షన్-నాగులాపల్లి-రావివారిపోడు రోడ్డుకు రూ.3.50కోట్లు, జెడ్.రాగంపేట ఎన్‌హెచ్ నుంచి నాయకంపల్లి రోడ్డుకు రూ.60లక్షలు, ఏలేశ్వరం-జడ్డంగి లింక్ రోడ్డుకు రూ.కోటి,కట్టమూరు-కాండ్రకోట-జె.తిమ్మాపురం రోడ్డుకు రూ.3 కోట్లు.

తూర్పుగోదావరి జిల్లాకు..

- తూర్పుగోదావరి జిల్లాలో 26.807 కిలోమీటర్ల పొడవుగల 8 రహదారుల అభివృద్ధికి రూ.12.50 కోట్లు కేటాయించారు. ఆర్‌కేరోడ్డు శాటిలైట్ సిటీ-సంపతనగరం-జి.యర్రంపాలెం-కొత్తతుంగపాడు రోడ్డుకు రూ.2 కోట్లు, పెద్దాపురం ఏడీబీ రోడ్డు-నాయకంపల్లి-జి.దొంతమూరు రోడ్డుకు రూ.80లక్షలు, వీరవరం-దుళ్ల రోడ్డుకు రూ.1.80కోట్లు, రాజవోలు-వేమగిరి-కడియం-కొత్తూరు రోడ్డుకు రూ.50 లక్షలు, యర్రాయిచెరువు-పి.వేమవరం రోడ్డుకు రూ.1.26కోట్లు, వడ్లూరు-తీపర్రురోడ్డుకు రూ.3.24కోట్లు, తేతలి-మునిపల్లి రోడ్డుకు రూ.60లక్షలు, పశివేదల-ఆరికిరేవులరోడ్డుకు రూ.2.30కోట్లు మంజూరయ్యాయి.

కోనసీమ జిల్లాకు..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11.865కిలోమీటర్ల పొడవుగల రెండు రహదారుల అభివృద్ధికి రూ.4.22 కోట్లు కేటాయించారు. శివకోడు-రామరాజులంక, లక్కవరం-శంకరగుప్తం, శివకోడు ముసలమ్మ ఆలయంనుంచి విశ్వేశ్వరరాయపురం రోడ్ల అభివృద్ధికి రూ.2.50కోట్లు, గోపాలపురం నుంచి గంటి-లొల్ల రోడ్డు,గోపాలపురం-పొడగట్లపల్లి రోడ్డు, గంటి-గోపాలపురం పుష్కర ఘాట్-పొడగట్లపల్లి రోడ్ల అభివృద్ధికి రూ.1.72 కోట్లు మంజూరు చేశారు.

సంస్థాగత సందడి



- మహానాడుకు ముందే సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి
- పార్టీ శ్రేణులను ఆదేశించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్
- నామినేటెడ్ పదవులు లేనివారికి, చురుకైన వారికి ప్రాతినిధ్యం
- యువకులకు కమిటీల్లో స్థానం కల్పించాలని నిర్ణయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలపై దృష్టిసారించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులు రాని పార్టీ నేతలను గుర్తించి వారికి సంస్థాగతంగా ప్రాధాన్యం కల్పించాలని సూచించింది. ముఖ్యంగా పార్టీలో యువ నాయకత్వానికి పెద్దపీట వేయడంతోపాటు రానున్న రోజుల్లో చురుగ్గా పనిచేసే కేడర్‌కు ప్రాధాన్యతా పదవులు కల్పించాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంగళవారం మార్గదర్శకాలు విడుదల చేశారు.

పనిచేసేవారికే ప్రాధాన్యం

సుదీర్ఘ కాలంనుంచి పార్టీ పదవుల్లోనే తిష్ట వేసిన కొందరికి ఉద్వాసన పలికి వారిస్థానంలో చురుకైన నాయకత్వం వహించి వారికి అవకాశం ఇవ్వవలసిందిగా సూచిస్తూ 11 అంశాలతో కూడిన మార్గదర్శకాలను విడుదల చేసింది. టీడీపీ ఆర్గనైజేషన్ స్ట్రక్చర్‌ను రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, డివిజన్, మండల స్థాయిలో క్లస్టర్ యూనిట్ విభజించడంతోపాటు పంచాయతీ వార్డు స్థాయిలో బూత్ లెవెల్ ఆర్గనైజేషన్‌ను పటిష్టంగా నెలకొల్పాలని సూచించారు. దీనిలోభాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బూత్‌స్థాయి, వార్డుస్థాయి కమిటీలఏర్పాటులో నాయకత్వాలు నిమగ్నమయ్యాయి. ఈసారి పార్టీ పరంగా సంస్థాగత ఎన్నికల్లో యువనేతలు గట్టిగా పోటీపడే అవకాశాలున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యేల పక్షాన కొందరు వ్యక్తిగత ప్రయోజనాలకోం పనిచేస్తూ పార్టీని నిర్వీర్యంచేస్తున్నారని కొన్నిచోట్ల వ్యక్తమవుతున్న అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ పరిశీలకుల ఆధ్వర్యంలో సంస్థాగత ఎన్నికలను జరపనున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి బూత్, యూనిట్, క్లస్టర్, మండల, డివిజన్, గ్రామ, వార్డు కమిటీలకు ప్రతిపాదితుల పేర్లను తీసుకోవాలి. అక్కడ వచ్చిన ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. వచ్చిన ప్రతిపాదనలపై పార్టీశ్రేణులు, ప్రజలు, రాష్ట్ర పార్టీ అభిప్రాయం తీసుకుని ముందుకు వెళ్లాలి. 70శాతం ఫీడ్ బ్యాక్ అంటే ఎక్కువగా ఉంటే ఆటోమెటిక్‌గా వారిని ఎన్నుకునేందుకు గ్రీన్ సిగ్నల్‌ను పార్టీ ఇచ్చింది. 70శాతం కంటే తక్కువగా ఫీడ్ బ్యాక్ ఉంటే ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి అబ్జర్వర్‌తో విచారణ జరిపి కార్యాచరణను అమలుచేయాలి. యూనిట్ ఇన్‌చార్జిలు తమ పరిధిలో ఉండే గ్రామ, వార్డు, ప్రెసిడెంట్, బూత్ ఇన్‌చార్జిలతో సమన్వయం చేసుకోవాలి. క్లస్టర్ ఇన్‌చార్జిలను మండలస్థాయి అధ్యక్షులతోపాటు ప్రతి పార్లమెంటుస్థాయిలో జరిగే సమావేశాలకు తప్పనిసరిగా ఆహ్వానించాలి. గ్రామ అధ్యక్షునితోపాటు యూనిట్ ఇన్‌చార్జిని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే సమావేశాలకు పిలవాలి. వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి. పార్టీలో వివిధ పదవులు పొందినవారు అందరూ కలిసి పార్టీ ఉన్నతికోసం పనిచేయాలి. క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జి, పార్టీ మండల ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో పనిచేయాలని సూచించింది. క్లస్టర్‌నుంచి పార్లమెంటు స్థాయి వరకు ఏర్పాటయ్యే కమిటీలు, వాటి అనుబంధ కమిటీలు అన్నింటినీ మహానాడు సభ కంటే ముందు పూర్తి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆ ఉత్తర్వుల్లో కోరారు. ఇప్పటికే పార్టీలో దశాబ్దాలనుంచి తిష్టవేసిఉన్న వృద్ధులు, పార్టీని పట్టించుకోని నాయకులను ఈసారి పక్కన పెట్టేసే అవకాశాలున్నాయని టీడీపీ పరిశీలకులు భావిస్తున్నారు.

అందరికీ న్యాయం చేస్తాం

- అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్
- రైల్వేలైన్ ఏర్పాటుకు భూములిచ్చిన వారితో అభిప్రాయాల సేకరణ



రైతులతో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, మే 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులకు, ప్రజలకు పూర్తి నష్టపరిహారం అందించి న్యాయం చేస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ భరోసా ఇచ్చారు. ముమ్మిడివరం మండలంలోని మహిపాలచెరువు పరిధిలోని గ్రాండ్ పార్కు ఫంక్షన్ హాలులో మంగళవారం అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాలకు సంబంధించి రైల్వేలైన్ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులు, నివాసగృహాలు నష్టపోయిన గృహ యజమానులు, రెవెన్యూ అధికారులతో కలిసి సమావేశమై రైతులు, ప్రజల అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసే కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. దీనిలోభాగంగానే దివంగత నేత జీఎంసీ బాలయోగి తలపెట్టిన రైల్వేలైన్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తానన్నారు. తన తండ్రి జీఎంసీ బాలయోగిపై నమ్మకంతో రైల్వేలైన్ నిర్మాణానికి భూములిచ్చిన అందరినీ ఆదుకుంటామని హామీఇచ్చారు. అన్ని జిల్లాల్లోను రోడ్డు రవాణా, రైల్వే, ఎయిర్‌పోర్టులు ఉండగా కోనసీమ జిల్లా ఒక్క రోడ్డు రవాణామార్గం మాత్రమే ఉండడం విచారకరమన్నారు. రోడ్డుమార్గాలవల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. నేటిపిల్లలు ఎక్కువగా పై చదువులకు, ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలనుకుంటున్నారు. వారికి రోడ్డు మార్గం తప్ప రైల్వే మార్గం అందుబాటులో లేదన్నారు. రైల్వేలైన్ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి ఇక్కడ రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని, సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో రెండురోజుల్లో సమావేశం ఉందని తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానన్నారు. అందరితో చర్చించి నిర్ణయాలు లిఖితపూర్వకంగా ఇస్తామన్నారు. అందరికీ న్యాయం చేస్తామని, అందరినీ కలుపుకుని వెళ్తామని, ఎవరు ఎటువంటి ఆందోళన, అపోహలకు గురి కావద్దన్నారు. ఏడు గ్రామాల్లోని రైతులకు ప్రయారిటీ ప్రకారం నష్టపరిహారం అందించే విషయంలో న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ సారవంతమైన భూముల్లో పలు రకాల పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, బహిరంగ మార్కెట్‌లో లక్షలు పలికే భూములకు వేలల్లో నష్టపరిహారం అందిస్తామంటే ఎలా అని తగిన రీతిలో నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. నివాస గృహాలు కోల్పోతున్న వారికి ఇళ్లస్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి అవసరమైన పూర్తి పరిహారం అందించాలని పలువురు కోరారు. రైల్వేలైన్ నిర్మాణానికి తొత్తరమూడి, విలస, భట్నవిల్లి, మాగాం, శానపల్లిలంక తదితర గ్రామాల నుంచి భూములిచ్చిన రైతులు తమ ఆవేదన వ్యక్తం చేయగా వారందరినీ ఆదుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. కోటిపల్లి-అమలాపురం రైల్వేలైన్‌కు సంబంధించి అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాల్లో ఏడు గ్రామాలకు చెందిన 158 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించగా 2001లో రైల్వేలైన్ నిర్మాణానికి అప్పటి ఎంపీ, మాజీ లోక్‌సభ స్పీకర్ బాలయోగి హయాంలో చర్యలు తీసుకోగా మళ్లీ 24ఏళ్ల తర్వాత ఆయన తనయుడు ఎంపీ హరీష్‌మాధుర్ చొరవతో భూములు కోల్పోతున్న ప్రతిఒక్కరికీ న్యాయం చేసి రైల్వేలైన్ ఏర్పాటుకు ముందడుగు వేయడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, ముమ్మిడివరం తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ పాల్గొన్నారు.

హైవే నిర్మాణానికి సహకరించండి

- పాశర్లపూడి రైతులకు ఎంపీ వినతి



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్, ఆర్డీవో మాధవి

అమలాపురం, మే 13(ఆంధ్రజ్యోతి):216 జాతీయ రహదారి సర్వేకు పాశర్లపూడికి చెందిన రైతులు సహకరించాలని అమలాపురం ఎంపీ గంటిహరీష్‌మాధుర్ విజ్ఞప్తి చేశారు. సర్వే త్వరితగతిన పూర్తిచేసేందుకు అదనపు సర్వేయర్‌ను రెవెన్యూ సిబ్బందిని నియమించాలని ఆర్డీవోను కోరారు. మంగళవారం మామిడికుదురు మండలం పాశర్లపూడిరైతులతో అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో హైవే రోడ్డు నిర్మాణ వివాదంపై ఎంపీ హరీష్‌మాధర్, ఆర్డీవో కె.మాధవి సమావేశం నిర్వహించారు. కోనసీమ అభివృద్ధిలోభాగంగా 216 హైవే రోడ్డు చాలావరకు పూర్తయిందని, కేవలంపాశర్లపూడిగ్రామంలోనే 300 మీటర్ల మేర భూసేకరణ జరగలేదని అన్నారు. 2020ధరల ప్రాతిపదికన నష్టపరిహారం చెల్లించాలని, కొంతమేర ఇళ్లకు నష్టం జరిగినా మొత్తం పరిహారం చెల్లించాలని ఎంపీని రైతులు కోరారు. సాధ్యమైనంత వరకు రైతుల డిమాండ్లపై అధికారులు సానుకూలంగా స్పందించాలని ఎంపీ ఆదేశించారు.

నేడు ఉపాధ్యాయ ఖాళీల భర్తీ వర్క్‌షాప్

అమలాపురం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలు, పాఠశాలల్లో ఏర్పడ్డ ఖాళీల భర్తీ వెరిఫికేషన్ నిమిత్తం ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. బుధవారం ఈ వర్క్‌షాపు జరగనుంది. అమలాపురం మండలం సమనస డిల్లీ పబ్లిక్‌స్కూలులో మంగళవారం డీఈవో ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో కేడర్, స్ట్రెంథ్, క్లియర్ వేకెన్సీలు, రీఅపోర్షన్ వేకెన్సీలు, 5 నుంచి 8 ఏళ్లకు ఖాళీలు, స్టడీ లీవ్స్, మిగిలిన ఉపాధ్యాయుల వివరాలను ఎంఈవోలు, హెచ్‌ఎంలనుంచి సేకరించారు. ప్రభుత్వయాజమాన్యాల పరిధిలోని ఐటీ సిబ్బందితో కలిసి హాజరయ్యారు. క్లియర్ వేకెన్సీలకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలని డీఈవో సూచించారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ, ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశరావు, రామలక్ష్మణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ నాటికి..

క్లోజర్ పనులు పూర్తి చేయండి: జేసీ



అమలాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీరు సక్రమంగా సరఫరా చేసే లక్ష్యంతో పంట కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, డ్రెనేజీశాఖ అధికారులతో ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న క్లోజర్ పనులపై మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. వచ్చే జూన్ నాటికి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నందున ఈలోగా ఆయకట్టు అభివృద్ధిశాఖలకు సంబంధించి మంజూరు చేసిన నిధులతో మరమ్మతులు, పూడికతీత పనులను పూర్తి చేయాలని సూచించారు. తూర్పు డెల్టా, సెంట్రల్ డెల్టాల పరిధిలో నామినేషన్‌పై కేటాయించిన పనులతోపాటు టెండరు విధానంలో అమలవుతున్న పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ మొదటివారం నాటికి ఈ పనులన్నీ పూర్తి కావాలన్నారు. కాల్వల్లో పెరిగిన మట్టి, ఇసుక, ఇతర అవశేషాలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీరు సజావుగా అందేందుకు అధికారులు ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రస్తుతం చేపడుతున్న పనులు పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి నిల్వల సామర్థ్యాలను పెంచే దిశగా చెరువులో పూడికతీత చేపట్టాలని, ఏఈల వారీగా లక్ష్యాలు నిర్దేశించి పనులు ప్రారంభానికి చొరవ చూపాలని, వీటిని సంబంధిత శాఖల ఈఈలు, డీఈలు సమన్వయం చేసుకుని రుతుపవనాలు రాక ముందే పూర్తి చేయాల్సిందిగా జేసీ ఆదేశించారు. డీఆర్వో రాజకుమారి, హెడ్‌వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ బి.శ్రీనివాసరావు, డ్రెనేజీ ఈఈ ఎంవీవీ కిశోర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆది ఊరు.. అభివృద్ధి ఊసేలేదు!



ఆదుర్రులోని ఆది బౌద్ధ స్థూపం

- ఆదుర్రు బౌద్ధ క్షేత్రాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

6



పాదగయలో పూజల్లో పాల్గొన్న తుమ్మల రామస్వామి (బాబు), జనసేన నేత శ్రీనివాసరావు

పాదగయలో సుదర్శన హోమం

సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం ఉండాలంటూ పూజలు

పురుహూతికా అమ్మవారికి పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పిన భారత సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం మెండుగా ఉండాలని కోరుకుంటూ పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మంగళవారం జనసేన నాయకులు పూజలు, హోమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవత పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో సుదర్శన హోమం జరిగింది. పురుహూతికా అమ్మవారికి ఖడ్గమాల కుంకుమార్చన, స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టు వస్త్రాలను డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు), పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పురుహూతికా అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఉచిత ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, చల్లా లక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి, మురాలశెట్టి సునీల్‌కుమార్, సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, జోగా రమణ, ఆగంటి ప్రభాకరరావు, కరణం సూరిబాబు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.





సుదర్శన హోమంలో పాల్గొన్న జన సైనికులు, పురుహూతికా అమ్మవారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

బిక్కవోలులో సుబ్రహ్మణేశ్వర స్వామికి లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



లక్ష్మీగణపతి స్వామికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



బిక్కవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో అమాయకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులపై భారత సైన్యం చేస్తున్న పోరాటం... ఒక మతం, దేశంపై చేస్తున్నది కాదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అంతకు ముందు ఆయన జనసైనికులతో కలిసి బస్సులో వచ్చి ముందుగా గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలనంతరం ఆలయం ముందు హారతులిచ్చి విలేకరులతో మాట్లాడారు. దేవతలకు సర్వసైన్యాధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి అని ఆయన సురులను అసురుల నుంచి కాపాడారన్నారు. దుష్ట ముష్కరులు మన దేశంపై దాడి చేస్తే కాపాడిన నిజమైన సైన్యాధ్యక్షులు మన భారత సైనికులన్నారు. వారు చూపిస్తున్న తెగువ, త్యాగాలను దృష్టిలో వుంచుకుని వారికి ఆత్మస్థైర్యం, ధైర్యం ఇవ్వాలని, ప్రధాని మోదీ ఈ దేశాన్ని రక్షించడానికి, సమైక్యంగా వుంచడానికి చేస్తున్న ప్రయత్నానికి బాసటగా నిలబడతామంటూ దక్షిణాపథాన వున్న అన్ని షణ్ముఖ క్షేత్రాల్లో అభిషేకాలు చేయాలని పవన్‌కల్యాణ్ ఆదేశాలలో తాము పూజలు చేస్తున్నామన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వున్న ఈ విశాల భారతదేశంలో భిన్న మతాలు, భిన్న బాషలు మాట్లాడే వారు, భిన్న సంస్కృతులు కలవారు వున్నారన్నారు. వీరందరినీ కలగలిపి ఒకటిగా నిలబెట్టి భిన్నత్వంలో ఏకత్వం తీసుకువస్తున్న ప్రధాని మోదీ చేతులకు బలం చేకూర్చాలని ద్వారా ఈ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని, శాంతి కాముకంగా వున్న ఈ దేశంలో ఎలాంటి అరాచకాలు జరగకుండా వుండాలని ప్రార్థించామన్నారు. తీవ్రవాదులు మనపై దండెత్తితే ఏవిధంగా ప్రతీకారం చూపగలమో ఆపరేషన్ సిందూర్ ద్వారా చూపగలిగామన్నారు. తెగబడుతున్న ఉగ్రవాదులను పూర్తిస్థాయిలో ఉపేక్షించమని నిరూపించేలా కార్యక్రమాలు చేశామని, దీనికి దైవబలం కూడ తోడవ్వాలనే ఆలోచనతో కేవలం హిందూ దేవాలయాలే కాక మసీదు, చర్చిల్లో కూడా జనసేనకు చెందిన వివిధ మతాల వారు ఇలాంటి పూజలు చేయాలని కోరామన్నారు. ఒకే మాట, ఒకే దేశం, ఒకే పద్ధతిగా వెళ్లాలని, అన్ని కులాలు, మతాల వారిని కలుపుకుని ముందుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు దైవ బలం తప్పనిసరిగా ఆశీర్వాదం ఇస్తుందని నమ్ముతూ దేశ సమగ్రతకు అందరూ కృషి చేయాలని మంత్రి దుర్గేష్ కోరారు. అనంతరం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని ప్రాచీన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దుర్గేష్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి వినతిపత్రం అందజేశారు. ఏపీటీడీసీ డైరెక్టర్ గంటా స్వరూప, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు ప్రియసౌజన్య, జనసేన అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం నగర శాఖ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి, రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో శాంతి ర్యాలీలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, కూటమి నేతలు

చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉన్న పురాతన ఆది బౌద్ధ స్థూపం అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామంలోని ఆది బౌద్ధ స్థూపాన్ని ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన ఈ బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.







బర్మా దేశం నుంచి బుద్ధిస్టులు పంపిన బుద్ధుని పాలరాతి విగ్రహం (ఎడమ), తైవాన్ దేశం నుంచి వచ్చిన విలువైన బుద్ధుడి కాంస్య విగ్రహం (కుడి)



ఆదుర్రులోని బౌద్ధ స్థూపం. దాని చుట్టూ ఉన్న ఉప స్థూపాలు

ఆది ఊరు... అభివృద్ధి ఊసేలేదు!

(మామిడికుదురు-ఆంధ్రజ్యోతి)

- ఆదుర్రు బౌద్ధ క్షేత్రాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

అశోక చక్రవర్తి నిర్మించిన 84వేల బౌద్ధ స్థూపాలను 60 మహా స్థూపాలుగా, మూడు దివ్య స్థూపాలుగా తీర్చిదిద్దారు. ఈ మూడు దివ్య స్థూపాల్లో మొదటిది ఆదుర్రులోను, రెండోది సాంచీలోను, మూడోది సారనాథ్‌లో ఉన్నట్టు చరిత్ర తెలియచెప్తోంది. ఆదుర్రులోని బౌద్ధ స్థూపాన్ని అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర సముద్ర యానం ద్వారా వచ్చి నిర్మాణాన్ని పర్యవేక్షించినట్టు చరిత్ర చెప్తోంది. వైనతేయ నదీతీరంలో 74 ఏళ్ల క్రితం ఈ బౌద్ధ స్థూపం బయల్పడింది. నాడు ఆది ఊరుగా పిలవబడిన గ్రామం నేడు ఆదుర్రుగా మారింది.

పూర్వం గ్రామంలో ఈ దిబ్బను దూబరాజు దిబ్బగా పిలిచేవారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఈ దిబ్బను స్థల యజమాని తవ్వుతుండగా పెద్ద పెద్ద ఇటుకలు బయటపడ్డాయి. పనివారిలో బర్మా వెళ్లి వచ్చిన ఒకరు అవి బుద్ధునివని తెలపగా ప్రభుత్వానికి ఈ విషయం స్థానికులు తెలియజెప్పారు. ప్రభుత్వం 1953లో రక్షిత ప్రాంతంగా ప్రకటించింది. అనంతరం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాల్లో బుద్ధుని అవశేషాలు ఆనాటి మట్టి పాత్రలు, పిడతలు లభ్యం కాగా వాటిని చెన్నై, హైదరాబాద్‌ల్లోని మ్యూజియంలకు తరలించారు. తవ్వకాల్లో బయల్పడిన స్థూపం పెద్దపెద్ద ఇటుకలతో నిర్మితమై ఇరువైపులా అశోకచక్రం ఆకారంలో రెండు ధ్యాన మందిరాలు, ఉప స్థూపాలు, చైత్యాలు బయల్పడ్డాయి. బర్మా, జపాన్, టిబెట్, శ్రీలంక, చైనా, తైవాన్ తదితర దేశాలనుంచి బౌద్ధ భిక్షువులతోపాటు మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన భిక్షువులు ఇక్కడికి వచ్చి స్థూపం విశిష్టతను తెలుసుకుని ప్రత్యేకప్రార్థనలు చేస్తారు. బౌద్ధ స్థూపం సమీపంలో బుద్ధవిహార్ ట్రస్టు ఏర్పాటుచేసిన షెడ్డులో బర్మా నుంచి వచ్చిన పాలరాతి విగ్రహంతో పాటు బుద్ధుడు తపస్సు చేసి చిక్కిశల్యమైన శరీరాన్ని తెలియచేసేలా తయారుచేసిన విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

పురాణ ప్రశస్తి కలిగిన బౌద్ధస్థూపం అభివృద్ధిలో స్థానిక బుద్ధవిహార్ ట్రస్టు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషి కీలకం. బుద్ధవిహార్ ట్రస్టు మెంబర్ సెక్రటరీ ఎస్ఎస్ఆర్ భూపతి, కుటుంబసభ్యులు సమకూర్చిన రూ.8 లక్షలతో బౌద్ధ భిక్షువుల వసతి కోసం అతిథిగృహ నిర్మాణాన్ని ఇటీవల చేపట్టారు. బౌద్ధ స్థూపం కీర్తిని తెలియచేయడానికి బుద్ధవిహార్ ట్రస్టు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవం పేరిట ప్రతిఏటా ఇక్కడ పలు కార్యక్రమాలు నిర్వహించి స్థూపం ఖ్యాతిని దేశ, విదేశాలకు విస్తరింపజేస్తోంది.

ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. బౌద్ధ స్థూపాన్ని సందర్శించడానికి వచ్చే బౌద్ధ భిక్షువులు, యాత్రికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. పాశర్లపూడి నుంచి బౌద్ధ స్థూపం వరకు ఏటిగట్టు రోడ్డును ఆధునీకీకరిస్తే అధిక సంఖ్యలో యాత్రికులు బౌద్ధ స్థూపాన్ని సందర్శించడానికి వీలు కలుగుతుందంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పురాతన చరిత్ర కలిగిన బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి చారిత్రక నేపథ్యం కలిగిన స్థూప విశిష్టతను దేశ, విదేశాలకు వ్యాప్తి చెందేలా కృషి చేయాలని బుద్ధవిహార్ ట్రస్టు సభ్యులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

బౌద్ధ స్థూపం అభివృద్ధికి స్థానికుల తోడ్పాటు

బౌద్ధ స్థూపం అభివృద్ధిలో స్థానికులు పలువురు దాతలు విరాళాలతో సమీపంలోని 40 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో ధ్యాన మందిరం షెడ్డు ఏర్పాటుచేసి బుద్ధుని విగ్రహాలను ప్రతిష్ఠింపజేసి బుద్ధ జయంతి, పలు ప్రత్యేక రోజుల్లో విశిష్ఠ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఓఎన్జీసీ ఆన్‌షోర్ బౌద్ధ స్థూపం అభివృద్ధికి రూ.4లక్షలు కేటాయించడంతో ప్రహరీ, లైబరీ, మరుగుదొడ్లు నిర్మించారు. రాజమహేంద్రవరం, కాకినాడలకు చెందిన ఓఎన్జీసీ సంస్థ కేటాయించిన రూ.10.70 లక్షల వ్యయంతో టాయిలెట్ బ్లాక్‌ను ఇటీవల నిర్మించారు.



స్థానికుల విరాళాలతో నిర్మితమవుతున్న అతిథి గృహం

నన్నయలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు

అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శివరామ ప్రసాద్



నన్నయ వర్శిటీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వీసీ, తదితరులు

దివాన్‌చెరువు, మే13 (ఆంధ్రజ్యోతి): అరుదైన మొక్కలతో ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తామని అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎన్‌వీ శివరామ ప్రసాద్ అన్నారు. యూనివర్శిటీ ప్రాంగణాన్ని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీసీ ఆహ్వానం మేరకు విశ్వవిద్యాలయాన్ని పరిశీలించామన్నారు. వృక్షశాస్త్రం విద్యార్థులకు విద్య, పరిశోధనలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వర్శిటీ ప్రాంగణాన్ని పూర్తిగా పరిశీలించి అవసరమైన ప్రాంతంలో మొక్కలు నాటుతామన్నారు. వీసీ సూచన మేరకు విశ్వవిద్యాలయాన్ని వర్షాకాలం నాటికి ప్రకృతిబడిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వీసీ మాట్లాడుతూ యూనివర్శిటీ ప్రాంగణంలో మొక్కలు పెంపకంతో అహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం లభిస్తుందన్నారు. నన్నయ ప్రాంగణం రాతినేల కావడంతో వేడి ఎక్కువగా ఉంటుందని, ఈ ప్రాంతంలో విస్తారంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించవలసిన అవసరాన్ని గుర్తించామన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డీన్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనారాయణస్వామి శ్రీపుష్పయాగం



ప్రత్యేక అలంకరణలో భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీపుష్ప యాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఆలయ పండితులు పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉత్సవమూర్తులకు పలు రకాల ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు, పుష్ప కైంకర్యం, స్నపనం అభిషేకం నిర్వహించి అర్చనలు చేశారు. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు (బేడా ఉత్సవం) చేశారు. ముగింపులో భాగంగా శయనోత్సవం నిర్వహించి విశేష పవళింపు సేవ పూర్తి చేశారు. ఈవో ఎం.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 1008 మందికి దంపత తాంబూలాలు అందించారు. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల ఆకాంక్షల మేరకు బుధవారం రాత్రి ఏడు గంటలకు ముక్తికా సరస్సులో తొలిసారిగా స్వామివారి తెప్పోత్సవం ఏర్పాటు చేసినట్టు ఈవో చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



అన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాండవ కిరణ్మయి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

అప్సరలో సింగిల్ బృందం సందడి



అప్సర థియేటర్‌లో సింగిల్ సినిమా చిత్ర బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ సమర్పణలో శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా ఆంధ్ర, తెలంగాణాలలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్ర బృందం విజయోత్సవ యాత్ర నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక అప్సర థియేటర్‌ని సందర్శించిన చిత్ర యూనిట్ హీరో శ్రీవిష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిశోర్‌లను గీతా ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఆహ్వానం పలుకగా ప్రేక్షకులు కేరింతలతో స్వాగతం పలికారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ ఈ నెల 9న విడుదలైన సింగిల్ చిత్రాన్ని విజయవంతం చేసి, మంచి కలెక్షన్లతో ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా ఇలానే ఆదరించాలని కోరారు. సింగిల్ సినిమా ఎలా ఉంది? కామెడీ ఆదిరిందా? బాగా ఎంజాయ్ చేస్తున్నారా? అంటూ ప్రేక్షకులతో ముచ్చటించిన శ్రీవిష్ణు, ప్రేక్షకులు సినిమా బాగుందని, కామెడీ ఇంకా బాగుందంటూ వచ్చిన అనూహ్య స్పందనకు అభివాదం చేశారు. వెన్నెల కిశోర్ ప్రేయసి పాత్ర గాయత్రి గురించి సినిమాలో హీరో విష్ణు పదేపదే ప్రస్తావించడం ప్రేక్షకుల్లో జోష్ నింపింది. చిత్రంలో తమ అందచందాలతో అలరించి, అపూర్వగా నటించిన కేతిక శర్మ, హరిణిగా నటించిన ఇవానాలు మాట్లాడుతూ సింగిల్ చిత్రాన్ని ఇంత అపూర్వంగా ఆదరిస్తున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

గోదావరి డెల్టా సిస్టమ్ సీఈగా శ్రీరామకృష్ణ

ధవళేశ్వరం, మే 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్‌గా ఆర్.శ్రీరామకృష్ణ నియమితులయ్యారు. డెల్టా సీఈగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు ఏప్రిల్ నెలాఖరున పదవి విరమణ చేయడంతో విజయవాడ హైడ్రాలజీ విభాగంలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామకృష్ణకు డెల్టా సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఈ నెల 5న బాధ్యతలు స్వీకరించారు. కాగా మంగళవారం పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు.

నిడదవోలులో మంత్రి త్రయం



మంత్రి సత్యప్రసాద్‌కు కోట సత్తెమ్మ తల్లి చిత్రపటం అందజేస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో మరో మంత్రి రవికుమార్

నిడదవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో మంగళవారం ఆయనను రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్ నిడదవోలు విచ్చేసిన సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. వారికి దుర్గేష్ కోటసత్తెమ్మ అమ్మవారి చిత్రపటాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారి వెంట మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్, బొర్రా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తోగుమ్మిలో చండీహోమం

కొవ్వూరు, మే 13(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలోని కొత్తపేటలో విజయదుర్గాదేవి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయార్చకులు మాజీ వైస్ ఎంపీపీ మద్దిపాటి సత్యనారాయణ, నాగసూర్యకుమారి దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చండీ హోమం జరిపించారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఉడతకు సాయం

ఎండలకు మూగజీవాలు మాడిపోకుండా పలువురు నీరు, ఆహారం ఇచ్చి కాసింత సాయం చేస్తుంటారు. కాకినాడ వివేకానంద పార్కులో అలా ఏర్పాటు చేసిన నీరు తాగి, ఆహారాన్ని తింటూ ఓ ఉడత ఇలా కనిపించింది.

– ఫొటోగ్రాఫర్, కాకినాడ

నేత్రపర్వం

సత్యదేవుడి శ్రీ పుష్పయాగం

- పలు జాతుల సుగంధభరిత పుష్పాలతో అర్చన
- విశేష పదార్థాలు, మధురఫలాలు నివేదన
- ముగిసిన దివ్య కల్యాణోత్సవాలు

అన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా చివరిరోజైన మంగళవారం శ్రీ పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 7.30కి నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, పెళ్లి పెద్దలైన సీతారాములను మంగళవాయిద్యాల నడుమ వేడుక జరిగే నిత్య కల్యాణమండపం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేర్వేరు వేదికలపై ఆశీనులు గావించి ప్రదానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్‌లు గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నవదంపతులను వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో శేషపాన్పుపై పవళించే విష్ణుమూర్తిగా సత్యదేవుడను, ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్న దేవిగా అమ్మవారిని అలంకరించి వేడుక కోసం తీసుకొచ్చిన వివిధ జాతుల పుష్పాలతో అష్టోత్తర శతసహస్ర నామాలతో అర్చకస్వాములు అర్చించారు. ఈ సందర్భంగా వివిధ రకాలైన తీపిపదార్థాలు, మదురఫలాలను నివేదించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందించారు. భక్తులు ఈ వేడుకను ఊగుటూయలకు ఎదురుగా ఏర్పాటుచేసిన అద్దంలో వీక్షించి పునీతులయ్యారు. అనంతరం దంపతులకు దంపతీతాంబూలాలు కార్యక్రమానికి హాజరైన మహిళా భక్తులకు రవికవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి సుధీర్, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి నిర్వహించారు. అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి వందలాది మహిళలు హాజరయ్యారు. ఈ వేడుకతో సత్యదేవుని విశ్వావసు నామసంవత్సర కల్యాణోత్సవాలుముగిశాయి.



పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో విష్ణుమూర్తిగా సత్యదేవుడు, మహాలక్ష్మిగా అనంతలక్ష్మి



స్వామి,అమ్మవార్లకు నివేదించిన మధురఫలాలు, విశేష పదార్థాలు



పుష్పార్చన కోసం వివిధ జాతుల పుష్పాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

'సురుచి' మిఠాయిలు

మండపేట, మే 13(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి శ్రీపుష్పయాగానికి కోనసీమ జిల్లా తాపేశ్వరం సురుచి మిఠాయిల తయారీసంస్థ 9రకాల మిఠాయిలను అందజేసినట్టు సంస్థ యాజమాని పోలిశెట్టిమల్లి ఖార్జునరావు (మల్లిబాబు) తెలిపారు. తాపేశ్వరంలో మిఠాయిలకు ప్రత్యేక పూజలు అనంతరం అన్నవరానికి తీసు కెళ్లారు. గత ఐదేళ్ల నుంచి స్వామికి మిఠాయి ప్రసాదాన్ని అందిస్తున్నామని మల్లిబాబు చెప్పారు.



శ్రీపుష్పయాగానికి సురుచి సంస్థ సమర్పించిన మిఠాయిలు

భయపెట్టేసింది!

ముమ్మిడివరంలో తాచుపాము హల్‌చల్



తాచుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

ముమ్మిడివరం, మే 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోని ఓ గృహంలో తాచుపాము హల్‌చల్ చేసి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. తిరుపతి చిన్నీ నివాసం గృహంలోకి తాచుపాము చేరి హల్‌చల్ చేయడంతో ఇంట్లోనివారు, చుట్టుపక్కలవారు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మకు గృహయజమాని చిన్నీ సమాచారం అందించడంతో పామును చాకచక్యంగా బంధించాడు. వేసవి తాపానికి పాములు బయటికి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్మ సూచించాడు. పాము కనిపిస్తే తనకు సమాచారం అందించాలని, వాటిని ఎవరూ చంపవద్దని విజ్ఞప్తి చేశాడు.

సీబీఎస్ఈ 10, ప్లస్2 ఫలితాల్లో 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల విజయకేతనం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ప్రకటించిన పదో తరగతి, ప్లస్2 ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఎన్.సత్యసాయి 483/500, ఎం.యశస్వి 482/500, పి తరుణ్‌కుమార్ 481/500, ఎస్.రఘునందన్ 478/500 మార్కులతో అగ్రగాములుగా నిలిచారని తెలిపారు. ప్లస్2 ఫలితాల్లో జి.సాయి అనీష్ 469/50, ధాత్రి నిహారిక 466/500 సాధించి అగ్రగాములుగా నిలిచారని, నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా శాతంతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో తమ విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకె.నరసింహారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



ప్లస్2 ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జి.సాయిఅనీష్, ధాత్రి నిహారిక



పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎన్.సత్యసాయి, ఎం.యశస్వి, పి.తరుణ్‌కుమార్, ఎస్.రఘునందన్

ఇసుక ట్రాక్టర్ బోల్తా : యువకుడి మృతి

కేసు లేకుండా బాధిత కుటుంబ సభ్యులతో రాజీకి యత్నం



బోల్తా పడి ఉన్న ట్రాక్టర్



మరణించిన చరణ్ (ఫైల్)

ఎటపాక, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మీదపడి ఓ గిరిజన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్థరాత్రి అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాయనపేట వద్ద నూతనంగా కల్వర్టు నిర్మాణం జరుగుతున్న సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక దందా చేస్తున్న ఎటపాకకు చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్లతో అర్ధరాత్రి రాయనపేట గోదావరి నదీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను భద్రాచలానికి రవాణా చేస్తున్నాడు. అయితే అర్ధరాత్రి అప్పటికే ఒకసారి భద్రాచలానికి ఇసుక రవాణా చేసి మరోమారు గోదావరిలోకి ఇసుక లోడు కోసం వస్తున్న క్రమంలో రాయనపేట వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి సుమారు 8 అడుగుల కిందకు పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న రాజుపేట గ్రామానికి చెందిన కోడి చరణ్ (16) ట్రాక్టర్‌తో పాటు కింద పడిపోయాడు. దీంతో ట్రాక్టర్ మీద పడి చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ పై నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే చరణ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ ఘటనపై ఎటువంటి కేసు లేకుండా ఉండేందుకు ఇసుక దందా సాగించే సదరు వ్యక్తి బాధిత కటుంబ సభ్యులతో రాజీయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఇందుకు బాధిత కుటుంబానికి రూ.2లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. అయితే ఈ ఘటనపై ఏ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అప్పలరాజు తెలిపారు.

సరదా కాస్తా విషాదం

ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి విద్యార్థి గల్లంతు

- పోలీసుల గాలింపు చర్యలు
- తీవ్ర అస్వస్థతకు గురైన మరొకరు
- బయటపడిన ఇద్దరు విద్యార్థులు



పెదశంకర్లపూడి వద్ద విద్యార్థి గల్లంతైన ఏలేరు ఎడమ కాలువ



గల్లంతైన విఘ్నేష్ (ఫైల్)



చికిత్స పొందుతున్న సిరిబాబు

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి ఏలేరు ఎడమ కాలువలో మంగళవారం సాయంత్రం నలుగురు విద్యార్థులు స్నానానికి దిగారు. వీరిలో ఒకరు గల్లంతు కాగా మరో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మరో ఇద్దరు విద్యార్థులను స్థానికులు కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువలో పెదశంకర్లపూడి వద్ద మంగళవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన పంది వీర వెంకట సత్యనారాయణ అలియాస్ విఘ్నేష్ (14), కాకినాడ సిరిబాబు (14), ఏళ్ళ సోరాబత్తుల రాజా (14), ఏళ్ళ శివ(14) సరదాగా స్నానాలు చేసేందుకు వెళ్లారు. వారిలో విఘ్నేష్, సిరిబాబు కాలువ ఉధృతికి కొట్టుకుపోగా విఘ్నేష్ గల్లంతయ్యాడు. కాలువలోకి దిగుతున్న రాజా, శివలను స్థానికులు కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. సిరిబాబు అధికంగా నీళ్ల తాగేయడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారి వెంటనే ఏలేశ్వ రం ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన విఘ్నేష్ ఆచూకీ తెలియరాలేదు. ఆ నలుగురు లంపకలోవ జిల్లా పరిషత్‌లో హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నారు. పెదశంకర్లపూడిలోని పంది రాంబాబు, సత్యవేణి దంపతుల ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన విఘ్నేష్ ఏలేరు ఎడ మ కాలువలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విఘ్నేష్ ఇంటికి ప్రత్తి పాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. సంఘటనా స్థలానికి వచ్చి విఘ్నేష్ ఆచూకీ కోసం ఉధృతంగా చర్యలు చేపట్టాలని ఏలేరు అధికారులను ఆదేశించారు. కాలువలో నీటి ఉధృతిని తగ్గించాలని సూచించారు. విఘ్నేష్ ఆచూకీ కోసం ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో పల్గొన్నారు. స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన విఘ్నేష్ ఆచూకీ కోసం ముమ్మర చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి వరకు గాలింపు చేపట్టినా విఘ్నేష్ ఆచూకీ తెలియరాలేదని, బుధవారం ఉదయం గాలింపు చేపడతామని ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



మృతదేహం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి తుని - హంసవరం రైల్వేస్టేషన్ల మధ్య తుని అతిథి కల్యాణ మండపానికి ఎదురుగా ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీకి వెనుక గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి 20 నుంచి 25 ఏళ్ల యువకుడు మరణించినట్టు రైల్వే పోలీసులు వెల్లడించారు. మృతదేహంపై నలుపురంగు ట్రాక్, ఎడమ చేయిపై శ్రావణి అనే పచ్చబొట్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో సోమవారం రాత్రి ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాల ప్రకారం... కరప మార్కెట్ సెంటర్ వెనుక నివాసముంటున్న ఇల్ల దుర్గారావు(60)ను భార్య వదిలేయడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. గతేడాది కుమారుడు మరణించడంతో మరింత కుంగిపోయాడు. భార్య కాపురానికి రాకపోవడం, కుమారుడి మరణంతో మనస్తాపానికి గురైన దుర్గారావు తునిలో ఉంటున్న కుమార్తెకు ఫోన్ చేసి చనిపోతున్నట్టు తెలిపాడు. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

14 మంది అరెస్టు

పెద్దాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం, జి.రాగంపేట గ్రామ శివార్లలో పేకాట శిబిరాలపై మంగళవారం దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,64,610నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొత్తపల్లిలో గడ్డిమేటు దగ్ధం

కొత్తపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన రైతు లొల్ల వీర వెంకట సత్యనారాయణ 8 ఎకరాల్లో గడ్డిమేటు వేసుకున్నాడు. మంగళవారం తెల్లవారు జామున గడ్డిమేటు దగ్ధమవుతోందని సమీప రైతులు సమాచారం ఇచ్చారని, చేలోకి వెళ్లేసరికి గడ్డి బూడిదైందని రైతు వాపోయాడు. మిషన్‌తో కోయించిన గడ్డిని ఒబ్బిడి చేసేందుకు రూ.70వేలు ఖర్చయిందన్నాడు. కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పాడు.



చేనులో దగ్ధమవుతున్న గడ్డిమేటు

ఉప్పలంకలో కుటుంబంపై దాడి

చర్యలు తీసుకుంటాం : ఎస్ఐ

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామంలో సోమవారం సాయంత్రం ఒక కుటుంబంపై పలువురు గ్రామస్తులు దాడి చేసి గాయపర్చారు. బాధితులు తెలిపిన సమాచారం ప్రకారం... ఉప్పలంకకు చెందిన సంగాని ప్రసాద్ మార్కెట్ యార్డు, రెడ్‌క్రాస్ బిల్డింగ్ వద్ద ఈ నెల 11న చెరువు రొయ్యలను ఎండబెట్టాడు. అదే గ్రామానికి చెందిన గేదెల పెద్దసత్తిబాబు తదితరులు ఎండబెట్టిన రొయ్యలను ఆటోతో తొక్కుకుంటూ పోయారు. దీనిపై ప్రసాద్, అతడి కుటుంబసభ్యులు వారిని నిలదీయగా దుర్భాషలాడారని, 12న సాయంత్రం తమ ఇంటిపైకి వచ్చి తనతో పాటు తన భార్య చిన తల్లిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఆరోపించాడు. తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు ప్రసాద్ తెలిపాడు. ఎంఎల్‌సీ రిపోర్టు అందిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట సునీత తెలిపారు.



దాడిలో గాయపడిన సంగాని ప్రసాద్

భార్య, ప్రియుడిని పట్టుకున్న భర్త

కాకినాడ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): భర్త లేని సమయంలో గుట్టుచప్పుడుగా ప్రియురాలి వద్దకు వచ్చి వెళ్తూ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న వ్యక్తిని భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ నగరంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి గుడి సమీపంలోని బాదం వారి వీధిలో నివాసముంటున్న ఓ వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చొల్లంగి వద్ద రొయ్యల చెరువుల్లో పని చేస్తుంటాడు. అతడి భార్య ప్రస్తుతం ఎల్ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే ఆమె ఓ ప్రైవేటు లా కాలేజీలో లా చదివే సమయంలో సహవిద్యార్థి బాలమణికంఠ పరిచయం అయ్యాడు. పరిచయం కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె భర్త డ్యూటీకి రొయ్యల చెరువు వద్దకు వెళ్లిన సమయంలో మణికంఠ వస్తూ పోతూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి డ్యూటీకి వెళ్లిన భర్త తన భార్య వ్యవహార శైలిపై అనుమానం వచ్చి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి తన భార్య మణికంఠతో ఉండడాన్ని చూసి బయట తలుపునకు గడియ పెట్టి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మజ్జి అప్పలనాయుడు ఇంటి వద్దకు చేరుకుని ఫిర్యాదు చేసిన వ్యక్తి భార్య, ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), మే 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడిని విశాఖపట్నంలోని సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న కాకినాడకు చెందిన చీకట్ల వెంకట మణిచందు అలియాస్ చందూని కాకినాడలో అరెస్టు చేశారు. 4 స్మార్ట్ ఫోన్లు, కీపాడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక లారీ ఢీకొని రైతు మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు



రమణ (ఫైల్)

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని వి.కొత్తూరు జంక్షన్‌లో జరిగింది. వి.కొత్తూరుకు చెందిన సూరెడ్డి రమణ (48) గ్రామంలో వి.కొత్తూరులో కూరగాయల సాగు చేసి తుని రైల్వే బజార్లో విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. మంగళవారం ఉదయం రైతు బజారుకు కూరగాయలు తరలించి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వి.కొత్తూరు జంక్షన్‌లో విశాఖ వైపు వెళ్తున్న ఇసుక లారీ బలంగా ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన రమణ అక్కడికక్కడే మృతి చెందగా స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని అడ్డగించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కృష్ణమాచార్యులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రమణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ సమయాల్లో మార్పు

ఈ నెల 20 నుంచి అమలు

ఆలమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర కూరగాయ మార్కెట్లో ఈనెల 20 నుంచి కూరగాయ అమ్మకాలు, కొనుగోళ్లలో కచ్చితమైన సమయాలు పాటించనున్నట్టు అభయాంజనేయ కూరగాయల మార్కెట్ కమిటీ కార్యదర్శి చెల్లుబోయిన సింహాచలం తెలిపారు. మార్కెట్ సమయాల వివరాలను ఆయన వివరించారు. మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాలు ఉదయం నుంచి ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తరువాత మాత్రమే మళ్లీ మార్కెట్ ప్రారంభమవుతుందని ఈ విషయాన్ని రైతులు, వర్తకులు గమనించాలని ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితిలోను మధ్యాహ్నం రెండు గంటల ముందు అమ్మకాలు ప్రారంభంకాదని, రైతులు ఇబ్బందులు పడి వచ్చి ఇక్కడ నిరీక్షించాలసి వస్తుందని అందువల్ల సమయాలను పాటించి మార్కెట్‌కు రావాలని సింహాచలం కోరారు.





సమోర్

వేసవి సెలవులు కావడంతో చింతూరు మండలం మోతుగూడెంలో ఎండలో సైతం తమ స్నేహితులతో కలిసి చెట్ల నీడలో ఆడుకుంటూ.. సీలేరు నదిలో సేదతీరుతూ మోర్ ఎంజాయ్ అంటున్న చిన్నారుల దృశ్యాలు

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

జూన్ 29న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష
యానాం, మే13(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి వ్యాప్తంగా బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 29న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ డైరెక్టర్ వి.రవిచంద్రన్ తెలిపారు. ఈనెల15 నుంచి 30వరకు సెన్‌టాక్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు పుదుచ్చేరి సెన్‌టాక్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

వైభవంగా పళ్లాలమ్మ తల్లి తీర్థం
అయినవిల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): ఎస్.మూలపొలం గ్రామదేవత పళ్లాలమ్మతల్లి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయ్‌భాస్కర్

ముమ్మిడివరం, మే13(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ కోసం పౌరసరఫరాల శాఖ నిరంతరం కృషి చేస్తుందని, వినియోగదారుల హక్కులను పరిరక్షించడానికి సరైన సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని పౌర సరఫరాల కార్యాలయంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై మంగళవారం వినియోగదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వినియోగదారుల హక్కుల చట్టం ఒక ముఖ్యమైన రక్షణ కవచమని, వారి ప్రయోజనాలు కాపాడడానికి ఒక శక్తివంతమైన సాధనమన్నారు. పౌర సరఫరాల శాఖకు తోడు కోకోఫెడ్ ఆధ్వర్యంలోని జిల్లాలో వినియోగదారుల సంఘాలు కూడా విశేష కృషి చేస్తున్నాయన్నారు. దీంతో వినియోగదారుల హక్కులు పూర్తిగా పరిరక్షిస్తున్నామన్నారు. తూనికలు, కొలతల శాఖ ఆహారభద్రత శాఖ వంటి అనుబంధ శాఖలతో కలిసి సమన్వయం చేసుకుని మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు.జిల్లా వినియోగదారుల హక్కుల రక్షణ కౌన్సిల్ నియామకం పూర్తి అయిందన్నారు. కోకోఫెడ్ జిల్లా అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి మాట్లాడుతూ వినియోగదారుల రక్షణకు అనేకకార్యక్రమాలు చేపడుతున్నామని, అధికారుల నుంచి, ప్రభుత్వం నుంచి సరైన సహకారం ఉంటే మరిన్ని మంచి కార్యక్రమాలు చేయగలుగుతామన్నారు. ప్రధాన కార్యదర్శి ఆదిత్యకిరణ్ మాట్లాడుతూ వినియోగదారుల చైతన్యానికి నెలకు ఒక కార్యక్రమం వంతున నిర్వహిస్తామని, కార్యక్రమాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల అధికారులందరూ పాల్గొని ప్రజలకు వినియోగదారుల వ్యవహారాలపై అవగాహన పెంపొందించాలన్నారు. కోకోఫెడ్ సభ్యులు, న్యాయవాది అద్దంకి అమరేశ్వరరావులతో పాటు పలువురు మాట్లాడారు. కోకోఫెడ్ సభ్యులంతా జిల్లా చరిత్రలో మొదటిసారి వినియోగదారుల రక్షణ కౌన్సిల్‌ను ఏర్పాటుచేసిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయ్‌భాస్కర్‌ను సత్కరించారు.

వేసవిలో కాల్వ పనులు పూర్తిచేయాలి: ఎమ్మెల్యే దేవ


ఇరిగేషన్, నీటిసంఘాల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో కాల్వ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఇంటి వద్ద నీటి సంఘాలు, ఇరిగేషన్ డ్రైనేజీ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వాకు పదివేల ఎకరాల సాగు విస్తీర్ణం అమలయ్యేలా వీరంతా పనిచేయాలన్నారు. ప్రధాన కాల్వ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా అవసరమైనచోట నీటిని బయటకు తోడి పనులు పూర్తి చేయాలన్నారు. కాల్వలోకి ఒరిగిన చెట్లను తొలగించాలన్నారు. 14 కాల్వల్లో రూ.64లక్షలతో చేపట్టే పనుల్లో నీటిసంఘాల నాయకులు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఈసారి పూడిక తొలగింపునకు నిధులు మంజూరు కాని కాల్వల్లో మట్టిని రైతులు స్వచ్ఛందంగా తవ్వకుని తీసుకుపోవడానికి నీటిసంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో తీర్మానాలు చేయాలన్నారు. ప్రభుత్వం డ్రెయిన్స్ పనులకు మరో రూ.86లక్షలు మంజూరు చేసిందని, వాటితో కూడా పనులు చేస్తారని అన్నారు. సఖినేటిపల్లి మండలంలోని రైతులను ముంపు బారి నుంచి బయట పడవేయడానికి కేశవదాసుపాలెం వద్ద ఉన్న స్ట్రయిట్ కట్ వద్ద ఏపీ ఐడీసీ ద్వారా ముంపునీరు సముద్రంలోని పంపుచేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయమని డ్రైనేజీ అధికారులకు సూచించారు. తాను మంత్రితో లేదా సంబంధిత చైర్మన్‌తో మాట్లాడతానన్నారు. కేశవదాసుపాలెంలో రెండు నెలల పాటు ముంపు నీటిని బటయకు తోడితే రైతులకు ఊపిరి పీల్చుకున్నట్టు అవుతుందన్నారు. సార్వా దాళ్వా పంటలు పండుతాయన్నారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, హెడ్‌వర్క్స్ డీఈఈ శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈఈ నాగేంద్ర కుమార్, డ్రైనేజీ డీఈఈ ఆర్.నాగార్జున, ఏఈలు రమేష్, సుందర్‌సింగ్, మూర్తి, రేష్మ, కిరణ్, నీటిసంఘం అధ్యక్షులు తిరుమల బాబి, యెనుముల సింహాచలం, చాగంటి స్వామి, రాపాక మల్లికార్జునరావు, బాబినాయుడు, సూర్యనారాయణ, నామన నాగభూషణంపాల్గొన్నారు.

నియోజకవర్గంలో కాల్వల అభివృద్ధికి సహకరించండి


విజయవాడలో నీటిపారుదలశాఖా మంత్రి నిమ్మలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, మే 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటి అభివృద్ధికి సహకరించాలని నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిమ్మలను కలిసి రూ.3కోట్లు విలువైన పనులకు ప్రతిపాదనలు అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా పి.గన్నవరం వార్ఫ్, ప్రధాన సెంటర్లలో కాల్వ చెంతనే 225మీటర్ల గోడ నిర్మాణానికి రూ.1.75కోట్లు నిధులు, ఆసుపత్రి చానల్ పరిధిలోని మూడు చోట్ల బలహీనంగా ఉన్న చోట గట్లను పటిష్ట పరుచుట, డీపీ ఏర్పాటుకు రూ.30లక్షలు నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని తూటు తొలగింపు, పలుచోట్ల కాల్వల్లో పూడిక తీయడానికి రూ.2.45 కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత పనులకు ఆమోదం తెలిపి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈవిషయమై స్థానిక అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారని తెలిసింది. నిర్వహణ నిధులతో మంజూరైన పను లను (ట్రఫ్‌నిర్మాణం, పూడికతీత పనులు) పదిరోజుల్లో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

శివకేశవుల శ్రీపుష్పోత్సవం
అంబాజీపేట, మే 13(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం శ్రీఉమాపార్వతి సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవిభూదేవి సమేత కేశవస్వామివార్ల పుష్పోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద పుల్లెల సీతారామం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్, సుదర్శనం కేశవాచార్యులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి పుష్పోత్సవం నిర్వహించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి యువత సహకరించాలి
ఉప్పలగుప్తం, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి విద్యావంతులైన యువత సహకరించాలని జనసేన నాయకుడు నాగులపల్లి పాపయ్యరాజు కోరారు. ఆయన ప్రోత్సాహంతో ఉప్పలగుప్తం గ్రంథాలయానికి బండారు శ్రీసాయిషణ్ముఖ రూ.10వేలు విలువైన విద్యార్థులకు ఉపకరించే పుస్తకాలను మంగళవారం బహూకరించారు. గ్రంథాలయాధికారి సలాది నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణపై వివరించారు. సలాది పుల్లారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి
రాజోలు, మే 13(ఆంధ్రజ్యోతి): ఈనెల20వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా రాజోలు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీ, వైసీపీ పార్లమెంటులో మద్దతు ఇచ్చి 48 కేంద్ర కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని అన్నారు. ఇది అమలైతే కార్మికవర్గంలో ఉన్న హక్కులను కోల్పోతారని తెలిపారు. అన్నపూర్ణ, సుజాత, సుబ్బలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

అప్పనపల్లి గోశాలకు పశుగ్రాసం అందజేత
మామిడికుదురు, మే 13(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో ఉన్న గోశాలకు మంగళవారం పలువురు దాతలు పశుగ్రాసాన్ని అందించారు. ఆలయ సహాయ కమిషనర్ కె.సత్యనారాయణరాజు విన్నపం మేరకు పెదపట్నం సర్పంచ్ గుబ్బల దుర్గ, పండు దంపతులు ఒక ట్రాక్టరు ఎండుగడ్డిని అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరంమండలం పాపాయిపాలేనికి చెందిన బొబ్బిలి వెంకటసీతారామారావు, బొబ్బిలి ప్రసాద్‌లు ఒక ట్రాక్టరు గడ్డిని, పి.గన్నవరం మండలం ఏనుగుపల్లికి చెందిన నూదా వీరభద్రరావు మనుమలు ఆయుష్, అయాన్స్‌లు ఒక ట్రాక్టరు గడ్డిని అందించారు. పశువులకు గ్రాసం అందించిన భక్తులను సహాయ కమిషనర్ అభినందించారు.

సీబీఎస్ఈ పదిలో 99.29శాతం ఉత్తీర్ణత



ఆర్‌పీ మునిస్వామిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

యానాం, మే 13(ఆంధ్రజ్యోతి): యానాం ప్రాంతీయ విద్యాశాఖ పరిధిలోనిప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాల్లో యానాం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీబీఎస్‌సీ తొలి ఫలితాల్లోనే సరికొత్త రికార్డును సృష్టించారు.2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సీబీఎస్‌సీ సిలబస్‌ను కొనసాగిస్తే ప్రైవేటీ పాఠశాలలు, కళాశాలలు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సిలబస్‌ను కొనసాగించారు. అయితే ఇప్పటికే స్టేట్ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం సీబీఎస్ఈ ఫలితాలు విడుదల కావడంతో పాఠశాలల వారీగా ఫలితాలను యానాం ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు. యానాంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల్లో 283మంది పదో తరగతి పరీక్షలకు హాజరైతే 281మందిఉత్తీర్ణత (99.29 శాతం)సాధించారు. పెసింగీ వీరబాబు(393) ప్రథమ, పల్లా దుర్గ, మల్లాడి దుర్గా ప్రసాద్ (362)ద్వితీయ, కె.జయమహాలక్ష్మీ (351) తృతీయ స్థానం సాధించారు. యానాం శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ, బైపీసీ, ఏబీఈ, హెచ్‌ఈపీలో మొత్తం 42 మందికి 42మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.రత్నప్రభ, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్‌లు ఆర్‌పీ మునిస్వామిని కలిసి సత్కరించారు. ఆర్‌పీ మునిస్వామి ఇద్దర్ని సత్కరిచారు.

చంద్రన్న బీమా పథకాన్ని అమలుచేయాలి
అంతర్వేది, మే 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామశాఖ సమావేశాన్ని మందపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం సత్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల కార్యదర్శి తాడి సత్యనారాయణ మాట్లాడారు. 2019జూన్‌లో నిలిచిపోయిన, రద్దుచేసిన చంద్రన్న బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని తాడి సత్యనారాయణ కోరారు. రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రన్న బీమా పథకాన్ని రూపొందించి 2016 అక్టోబరు 2వ తేదీ నుంచి రూ.5లక్షల బీమాతో ప్రారంభించారని గుర్తుచేశారు. ఈపథకాన్ని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, పోతాబత్తుల శ్రీనివాస్, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు పోతురాజు కృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి రాజు, మానుపాటి సూరిబాబు, గుర్రం సునీల్, మాజీ ఎంపీటీసీ గుండుబోగుల వాసు, శంకరగుప్తం గోపి, కొండా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయండి
ముమ్మిడివరం, మే 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తూర్పుగోదావరి జిల్లాకు విచ్చేస్తున్నందున ముమ్మిడివరం నిజకవర్గంలోని ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వీధి చిరంజీవి పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో ఎమ్మెస్పీ జిల్లా కోశాధికారి ఖండవల్లి ఏలియా అధ్యక్షతన మంగళవారంనియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల సమావేశం జరిగింది. కాకినాడ కరణంగారి జంక్షన్‌లోని కమల్‌వీర్ సినిమాహాలు పక్కన ఈనెల19న జరిగే కొండేపూడి శ్యామ్‌బాబు సంస్మరణ సభకు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నందున అధిక సంఖ్య కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో చెట్ల దుర్గారావు, పెదపూడి రుక్మిణి, ఉందుర్తి ప్రకాష్, ఉందుర్తి కిశోర్, అయినవిల్లి సూర్యారావు, సవరపురాజు, పెదపూడి రాజు, మట్ట వెంకటేశ్వరరావు, ప్రకాష్, తొత్తరమూడి జ్యోతిబాబు, పెదపూడి కృష్ణ, బొమ్మి రామకృష్ణ, సత్తాల సంపదరావు, చుట్టుగుళ్ల అన్నవరం, పలువురు నాయకులు పాల్గొన్నారు. ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టున డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్, మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీని నెరవేర్చడంపై ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శిల్పి పెద్దిరెడ్డి మాధవరావుకు వారు మంగళవారం విగ్రహ నమూనాలను అందించారు.

అమలాపురంలో ట్రాఫిక్ మళ్లింపు
అమలాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ శివారు ఈదరపల్లి వద్ద కొత్తగా వంతెన నిర్మాణంలో ఉన్న దృష్ట్యా ట్రాఫిక్‌ను కొన్నిరోజుల పాటు మళ్లించినట్టు ఆర్‌అండ్‌బీ ఈఈ బి.రాము తెలిపారు. అమలాపురం బస్టాండు నుంచి బయలుదేరే ఆర్టీసీ బస్సులు గడియారస్తంభం సెంటర్, కళాశాల రోడ్డు, వై-జంక్షన్, తోటలపాలెం, వాకలగరువు మీదుగా అంబాజీపేట, రావులపాలెం వైపు మళ్లించినట్టు తెలిపారు. అదేవిధంగా రావులపాలెం వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా అదేమార్గంలో రావాల్సిందిగా సూచించారు. ప్రైవేటు ట్రావెల్ బస్సులు, లారీలు నల్లవంతెన, జనుపల్లె, నేదునూరు, ముక్కామల మీదుగా రావులపాలెం వైపు మళ్లించామని చెప్పారు. బైకులు, ఆటోలు, కార్లు నల్లవంతెన, సావరం బైపాస్‌రోడ్డు, కొత్తగా నిర్మించిన మట్టివంతెన మీదుగా వెళ్లాల్సిందిగా కోరారు. వంతెన నిర్మాణం దృష్ట్యా ప్రజలు పోలీసులు, అధికారులకు సహకరించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ రాము విజ్ఞప్తి చేశారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం
ఉప్పలగుప్తం, మే 13(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి శ్రీభీమేశ్వరా ఆడిటోరియంలో ఈనెల14న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ తెలిపింది. జనసేన నాయకుడు నల్లా అజయ్ జన్మదిన సందర్భంగా నల్లా సూర్యచంద్రరావు సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా శిబిరంలో బీపీ, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈసీజీ, 2-డి ఎకోపరీక్షలతో పాటు 20 రకాల శస్త్రచికిత్సలు విజయవాడ నారాయణరెడ్డి ఆసుపత్రిలో ఉచితంగా చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా ముత్యాలనాయుడు
అంబాజీపేట, మే 13(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా డాక్టర్ ఎం.ముత్యాలనాయుడును నియమించారు. ఇప్పటివరకు పనిచేసిన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తాడేపల్లిగూడెం వెంకటరామన్నగూడెంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఉద్యాన సమాచార కేంద్రానికి ప్రిన్సిపాల్ సైంటిస్టుగా పదోన్నతిపై వెళ్లారు. నూతనంగా నియమితులైన ముత్యాలనాయుడు ప్రస్తుతం కర్నూలు జిల్లా నంద్యాలోని మహానంది ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా పనిచేస్తున్నారు. ఆయన ఈనెల19న బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటివరకు స్థానిక కేంద్రంలో ఉన్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు ఇన్‌చార్జ్ అధిపతిగా వ్యవహరించనున్నారు. ఈసందర్భంగా స్థానిక పరిశోధన కేంద్రంలో పదోన్నతిపై వెళ్తున్న చలపతిరావును స్థానిక శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు
మామిడికుదురు, మే13(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి, పెదపట్నంలంక గ్రామాల్లో అమ్మవార్ల జాతరలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాశర్లపూడిలో వేంచేసి ఉన్న నూకాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల జాతరను చిత్రవిచిత్ర వేషధారణలు, తీన్మార్ విన్యాసాలు, గరగ నృత్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పెదపట్నంలంకలోని గిడుగువారిపాలెంలో వేంచేసి ఉన్న గ్రామదేవత వనువులమ్మ జాతరను భక్తులు కన్నుల పండుగగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మంగళవారం అమ్మవార్లకు భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

జేసీని కలిసిన ఏపీసీ మమ్మీ



అమలాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయ అధికారిగా జి.మమ్మీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆమె సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్‌గా ప్రభుత్వం నియమించింది. తొలిసారిగా కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని, విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషాను మర్యాద పూర్వకంగా కలిశారు.

సరస్వతీ పుష్కరాలకు బస్సు సర్వీసు
అమలాపురం టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఈనెల15 నుంచి 26వరకు జరగనున్న కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. మే 18వ తేదీ ఆదివారం ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. యాత్ర ప్యాకేజీలో భాగంగా వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాలతో పాటు ముఖ్యంగా సరస్వతీ నది పుష్కర స్నానం చేసే ప్రాంతానికి నడుపుతామని తెలిపారు. అదేవిధంగా అమలాపురం డిపో నుంచి ఇంద్ర ఏసీ సర్వీసు కూడా ఏర్పాటుచేశామన్నారు. ఈ బసస్సులకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ టిక్కెట్ కోసం 9959225576, 9959225550 నెంబర్లను సంప్రదించాలన్నారు.సూపర్‌లగ్జరీ బస్‌టిక్కెట్ ధర రూ.2200, ఇంద్రఏసీ బస్ టిక్కెట్ ధర రూ.2700గా తెలిపారు. బస్సు సామర్థ్యానికి సరిపడావస్తే వారి గ్రామం నుంచి నేరుగా బస్సును ఏర్పాటు చేస్తామని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఎన్ఎంయూ ధర్నా
అమలాపురం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం వద్ద ఎన్ఎంయూ పిలుపు మేరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి సంఘీభావం తెలిపారు. గతంలో ఇచ్చిన సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలుచేయాలని,ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు ఇచ్చి అన్‌లిమిటెడ్ రిఫరల్ వైద్యం కల్పించాలని, లింకు డ్యూటీలు రద్దు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితో నిర్వహించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. యూనియన్ డిపో కార్యదర్శి కె.రవికుమార్, రామచంద్రపురం డిపో కార్యదర్శి వరలక్ష్మి, వీవీవీ నారాయణ, బూరమ్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పుట్టినరోజు వేడుకలకు దూరం: ఎమ్మెల్యే
పి.గన్నవరం, మే 13(ఆంధ్రజ్యోతి): పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో 26మంది మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అలాగే సైనికుడు మురళీనాయక్ వీరమరణం పొందడం తనను కలిచివేసిందన్నారు. ఈనేపథ్యంలో గురువారం తాను జరుపుకోవాల్సిన పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. మిత్రులు, శ్రేయోభిలాషులు, నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఎటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయవద్దని ఎమ్మెల్యే కోరారు.

ఉత్తర పీకాలేరు మూసేస్తున్నారని రైతుల ఫిర్యాదు
ఉప్పలగుప్తం, మే13(ఆంధ్రజ్యోతి): గోపవరం పరిధిలోని ఉత్తర పీకాలేరు డ్రెయిన్‌ను మూసి వేస్తున్నారంటూ రైతులు మంగళవారం డ్రెయిన్స్ ఈఈ కిశోర్‌కు ఫిర్యాదు చేశారు. సరిపల్లి, గోపవరం, కూనవరం, సరిపల్లి తదితర గ్రామాలఆయకట్టు పొలాల్లోని మురుగునీరు ఈడ్రెయిన్ ద్వారా బయటకు పోతుంది. ఈడ్రెయిన్‌ను తమ అవసరాల కోసం కొందరు రైతులు తూరలు వేసి మట్టితో కప్పుతున్నారని ఈఈకి విన్నవించారు. ఈడ్రెయిన్‌లో రెండేళ్ల క్రితం రూ9లక్షలతో పూడికతీశారు. ఆనాడు పూడిక తీయ్యాలని అడిగినవారిలో కొందరు డ్రెయిన్‌ను కప్పేందుకు సిద్ధ పడటం గమనార్హం. ఈడ్రెయిన్‌కు తూరలువేసి మట్టితో కప్పడం వల్ల పొలాలకు ముంపు ఏర్పడుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తెలుగురైతు అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో చవటపల్లి శ్రీనివాసరావు, అడపా సీతారామయ్య, బండారు నాగేశ్వరరావు, పెమ్మిరెడ్డి సత్యవేణి, ఆకుల అప్పారావు, ఆకుల అన్నవరం తదితరులు ఈఈకి ఫిర్యాదు చేశారు.

సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి
ముమ్మిడివరం, మే 13(ఆంధ్రజ్యోతి): సామాజిక పరిస్థితులపై యువత అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ సహకారంతో అమలాపురం కార్లిమేట్ సిస్టర్ ఆఫ్ థెరిసా, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, పాలకొల్లు సత్యం చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని మహిళా శిశు సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని యువత అంతా సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన ఏర్పరుచుకుని గ్రామీణ ప్రాంతంలో నివశించే కుటుంబాలకు ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. సీడీపీవో ఐ.విమల మాట్లాడుతూ సమాజంలోని మహిళలపైనా, చిన్నపిల్లలపైనా జరుగుతున్న లైంగిక దాడులు, చర్యలను రూపు మాపాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేట్ జి.కరుణాకరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు మూడు మాడ్యూల్‌లో శిక్షణ ఇస్తామని, యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన, రాజ్యాంగంపై అవగాహన, గ్రామీణ ప్రాంతాల సమస్యలపై యువత ఏ విధంగా అవగాహన పెంపొందించుకోవాలనే అంశంపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కన్నీడి వెంకటేశ్వరరావు, సత్యం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఎన్.సంజయ్ పాల్గొన్నారు.

మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగులపై ట్రాక్టర్ నిర్వాహకుల దాడి
ఆరుగురిపై కేసు నమోదు
అంబాజీపేట, మే 13(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న సమయంలో మైనింగ్‌స్క్వాడ్ ఉద్యోగులు తనిఖీలు చేపడుతున్న సమయంలో ట్రాక్టర్ నిర్వాహకులు, మైనింగ్ సిబ్బంది మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో మైనింగ్ సిబ్బందిపై ట్రాక్టర్ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. దీంతో మట్టి ట్రాక్టర్ నిర్వాహకులు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. పి.గన్నవరం మండలానికి చెందిన మట్టపర్తి పండు తన ట్రాక్టర్లతో అంబాజీపేటకు నల్ల మట్టిని తరలిస్తున్నారు. అంబాజీపేటలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద మట్టిని తరలిస్తున్న వాహనాన్ని సుధాకర్ ఇన్‌ఫ్రా అనే పేరుతో మైనింగ్ స్క్వాడ్ సిబ్బంది అక్కడికి చేరుకుని బిల్లులు చూపించాలని ఉద్యోగి ఊడుమూడి అనిల్‌కుమార్ కోరాడు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ అతని ఓనర్ మట్టపర్తి పండుకు ఫోన్ చేశారు. దీంతో పండు మరో ఐదుగురు వ్యక్తులతో అక్కడికి చేరుకుని అనిల్‌కుమార్‌తో పాటు అక్కడ ఉన్న సిబ్బందితో ఘర్షణకు దిగారు. అనిల్‌కుమార్‌ను కొబ్బరికమ్మలు, రాళ్లతో పండు, అతని వర్గీయులు దాడిచేసి గాయపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. సుధాకర్ ఇన్‌ఫ్రా పేరుతో ఉన్న కారును, బిల్లుపుస్తకాలు, రూ.1.30లక్షల నగదును అపహరించుకుపోయారని అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

గూడపల్లి సర్పంచ్ మృతి



మలికిపురం, మే 13(ఆంధ్రజ్యోతి): గూడపల్లి సర్పంచ్ సుందర బ్రహ్మయ్య అలియాస్ తాతాజీ (70) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. ఆయన మృతికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, ముప్పర్తి నాని తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

జవాన్లకు వాకర్స్ క్లబ్ నివాళి


గడియారస్తంభం సెంటర్‌లో జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా వీరమరణం పొందిన అనంతపురం వాసి మురళీనాయక్‌తో సహా వీరమరణం పొందిన వారికి వాకర్స్ హెల్త్‌క్లబ్ సభ్యులు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గడియారస్తంభం సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జవాన్‌లు అమర్‌రహే అంటూ నినాదాలిచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్‌కు చెందిన గోకరకొండ నాగేంద్ర, గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, పడాల నాయుడు, గుర్రం రామకృష్ణ, నూకల సత్యనారాయణ, గోటేటి గంగాధర్, పట్నాల రమణ తదితరులు కార్యక్రంలో పాల్గొన్నారు.

లంకతల్లెమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం
ముమ్మిడివరం, మే 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గ్రామదేవత శ్రీ లంకతల్లెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నెలకొల్పి వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారి పసుపు, కుంకుమను తీసుకువచ్చి లంకతల్లెమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. ఈనెల19వ తేదీ నుంచి వివిధ సామాజికవర్గాల వారు అమ్మవారి సంబరాలు నిర్వహిస్తారు. జూన్ 1వ తేదీతో సంబరాలు ముగియగా, 2న జాగారం, 3న తీర్థ మహోత్సవం, 5 దండాడింపు కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి కమిటీ వారు ఏర్పాట్లు పూర్తిచేశారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి
పి.గన్నవరం, మే 13(ఆంధ్రజ్యోతి):బాలల హక్కులు, చట్టాలపై బాలికలు అవగాహన కల్గి ఉండాలని పి.గన్నవరం ప్రాజెక్టు సీడీపీవో వై.విజయశ్రీ తెలిపారు. పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం వేసవి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిశోరి బాలికలు ఆరోగ్య సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలకార్మిక, విద్యా హక్కు, పోక్సో చట్టాలు, లైంగిక నేరాలు, శిక్షలు తదితర అంశాలపై కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, స్థానిక సెంటర్ల అంగన్‌వాడీ వర్కర్స్, బాలికలు పాల్గొన్నారు.

ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిగా దివ్యశ్రీ



అంబాజీపేట, మే 13(ఆంధ్రజ్యోతి): ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా టి.దివ్యశ్రీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన వైద్యాధికారులు ఎ.ఇంద్రావతి, గీతాంజలిలు ఉన్నత చదువులు కోసం వెళ్లడంతో ఉన్నతాధికారులు దివ్యశ్రీని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిగా నియమించారు. ఈసందర్భంగా సిబ్బందిని ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

దేవస్థానం భూముల్లో అనధికార కట్టడాలు చేస్తే చర్యలు
అంతర్వేది, మే 13(ఆంధ్రజ్యోతి): శృంగవరప్పాడు గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం భూమి సర్వే నంబరు 124లో అనధికారికంగా కట్టడం నిర్మాణం చేపట్టి సెంట్రింగ్ చేస్తున్న పనులను దేవస్థానం అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. ఆలయ భూముల్లో అనధికార కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని దేవస్థానం అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తక్షణమే పనులను నిలిపివేయించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ విజయసారథి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన


మామిడికుదురులో ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆందోళన చేస్తున్న రైతులు

మామిడికుదురు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కొనే నాథుడు కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దాళ్వాలో పండించిన ధాన్యం రాశులుగా చేసి 20రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని ఇప్పటివరకు ప్రభుత్వం కొనలేదని ఆరోపిస్తూ రైతులు మామిడికుదురులో మంగళవారం ఆందోళన చేశారు. ధాన్యం కొనుగోలు కోసం అధికారుల చుట్టూ తిరుగుతుంటే తమకు టార్గెట్ అయిపోయిందని వారు పేర్కొంటున్నట్టుగా తెలిపారు. పండించిన పంటలో 50శాతం ఇంకా కళ్లాల్లోనే రాశులుగా ఉందని, టార్గెట్ ఎలా అయిపోయిందని రైతులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే పండించిన ధాన్యాన్ని కొనే విధంగా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు చేయకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని రైతులు హెచ్చరించారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుందామంటే అయిన కాడకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు భూపతి వెంకటప్రసాద్, యనమదల రాజారావు, కోన రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గరుడోత్సవం
అమలాపురం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామంలోని పద్మావతి అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామవారి గరుడోత్సవం మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి-అమ్మవార్లను ఉంచి బండారులంక పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఊటుకూరివారి వీధి భక్తులు ఉత్సాహంతో ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, శక్తివేషాలు, డప్పులు, హైదరాబాద్ వారిచే బోనాల నృత్యం, శ్రీనివాసా మహిళా భజన మండలి కోలాటం వంటి సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి అత్యధిక సంఖ్యలో పురప్రజలు పాల్గొన్నారు. తొలుత అంకం సత్యనారాయణమూర్తి, సత్యలక్ష్మి దంపతులు స్వామి-అమ్మవార్లకు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, దేవాంగసంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, బాలమిత్రసంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, బళ్ల సత్తిరాజు, ఓలేటి నాగరాజు, లంకాడి లక్ష్మణ్, యినుమర్తి రామలక్ష్మణ్, నల్లా మధు పాల్గొన్నారు.



వాడపల్లిలో స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి కిరణ్మయి తదితరులు



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

ఆత్రేయపురం, మే 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎం.కిరణ్మయి కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత అర్చక బృందం వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏడు ప్రదక్షిణలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది వారికి స్వామివారి చిత్రపటం అందచేశారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తునికి చెందిన ధనలక్ష్మి జ్యూయలర్స్ అధినేత దాడిశెట్టి విష్ణుచక్రం, రామజ్యోతి దంపతులు రూ.2.20 లక్షల విరాళాన్ని అందించారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని అందచేశారు.

వాడపల్లి ఆదాయం రూ.2.39 లక్షలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,39,783 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

ర్యాలి ఆలయంలో ఘనంగా పుష్పోత్సవం

ఆత్రేయపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలోని ఉపాలయంలో ఉన్న రమాసత్యనారాయణస్వామి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య పుష్పోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ర్యాలిలో పుష్పోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



అమరావతిలో అధికారులతో సమీక్ష జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే మంగళవారం అసెంబ్లీలో ఎస్టిమేట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2019-2022 మధ్య వరకు జరిగిన సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖలతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ఆయనకు వివరించారు. సమావేశంలో ప్రభుత్వ అంచనాల కమిటీ రాష్ట్ర సభ్యులు భూమా అఖిలప్రియ, డాక్టర్ పార్థసారధి, అసెంబ్లీ ఉపకార్యదర్శి రాజ్‌కుమార్, సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు..విద్యార్థులను తీర్చిదిద్దే ఆలయాలు

కె.గంగవరం, మే 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలను తీర్చిదిద్దే ఆలయాలు అని రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వరాహ లక్ష్మి అన్నారు. మంగళవారం కూళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తయిన పిల్లలు పాఠశాల సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అంగన్‌వాడీల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న పలు కార్యక్రమాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా యూనిట్, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు కడియాల రాఘవన్, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం

బాధితుడికి ఆర్థికసాయం

రావులపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి): రావులపాడుకు చెందిన బైరిశెట్టి శ్రీను రెండు కిడ్నీలు పాడైపోవడంతో వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి వారి ఆర్థిక స్థోమత సహకరించకపోవడంతో అక్షయ సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ నుంచి రూ.10వేలతో పాటు మిరియాల సుబ్బరాజు , చైతన్యరెడ్డి, దండుప్రోలు విజయ్, కె.పావని , లంకే వెంకటేశ్వర్లు వెరశి రూ.14,500 మంగళవారం అక్షయ సేవా సంస్థ సభ్యులు బాధితుడికి అందచేశారు.



బాధితుడికి ఆర్థికసాయం చేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

రాయవరం, మే 13(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. సీఐటీయూ యూటీఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ మాచవరం సెక్టార్ సూపర్‌వైజర్ విష్ణుకుమారి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఆరు నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఐదు రోజులపాటు వేసవి శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు కడలి శ్రీనివాస్, కిలపర్తి శ్రీనివాసరావు, వి.గోపికృష్ణ, నల్లమిల్లి భాస్కర రెడ్డి, సీహెచ్ సత్యవతి, ఎస్.సత్య, విద్యార్థులు పాల్గొన్నారు.



పసలపూడిలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): అంగర సబ్‌స్టేషన్‌లో రెండు కొత్త బ్రేకర్లను ఏర్పాటు చేయడం వల్ల బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచరమట్లు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, వల్లూరు, నేలటూరు, గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అమలాపురంలో ట్రాఫిక్ మళ్లింపు

అమలాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం శివారు ఈదరపల్లి వద్ద కొత్త వంతెన నిర్మాణం దృష్ట్యా కొన్ని రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించినట్టు ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము తెలిపారు. అమలాపురం బస్టాండు నుంచి బయలుదేరే ఆర్టీసీ బస్సులు గడియార స్తంభం సెంటర్, కళాశాల రోడ్డు, వై-జంక్షన్, తోటలపాలెం, వాకలగరువు మీదుగా అంబాజీపేట, రావులపాలెం వైపు మళ్లించినట్టు తెలిపారు. రావులపాలెం వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా అదే మార్గంలో రావాల్సిందిగా సూచించారు. ప్రైవేటు ట్రావెల్ బస్సులు, లారీలు నల్లవంతెన, జనుపల్లె, నేదునూరు, ముక్కాలమ మీదుగా రావులపాలెం వైపు మళ్లించామన్నారు. బైకులు, ఆటోలు, కార్లు నల్ల వంతెన, సావరం బైపాస్ రోడ్డు, కొత్తగా నిర్మించిన మట్టివంతెన మీదుగా వెళ్లాల్సిందిగా ఆయన సూచించారు.

వ్యాక్సినేషన్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

రావులపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి): ఊబలంక పీహెచ్‌సీ ఆవరణలో గోపాలపురం, ర్యాలి, ఊబలంక, పెదపళ్ల, చొప్పెళ్ల పీహెచ్‌సీల సిబ్బందికి వ్యాక్సినేషన్ రిజిస్ట్రేషన్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీ సత్యనారాయణ పాల్గొని చిన్న పిల్లలకు వ్యాక్సిన్ వేసే ప్రతి డోస్ ఈ యాప్‌ని వినియోగించడం ద్వారా రికార్డు అవుతుందన్నారు. దీనివల్ల పిల్లల వ్యాక్సినేషన్ ప్రక్రియ భద్రంగా ఉండటంతో పాటు డోసేజ్‌లు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కే హసీనా, కె.శ్యాముల్‌రాజు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో స్వామివారికి పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా స్వామివారి పుష్పయాగోత్సవం

కపిలేశ్వరపురం, మే 13(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో ఉన్న దుర్గామాత సమేత పార్వతీ పాపవినాశేశ్వరస్వామి, పార్వతిమాత సమేత అగస్త్యేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి పుష్పయాగోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కాలధరి ఉమామహేశ్వరరావు, కార్తికేయశర్మ ఆధ్వర్యంలో పండితులు సూరిపండు తదితరులు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలను జరిపారు. అనంతరం స్వామివారి పుష్పయాగోత్సవాన్ని వేద మంత్రోశ్చరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 8న ప్రారంభమైన స్వామివార్ల కల్యాణోత్సవాలు మంగళవారం పుష్పయాగోత్సవంతో ముగిసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు కమిటీ అధ్యక్షుడిగా
రహీం ఎన్నిక

మండపేట, మే 13(ఆంధ్రజ్యోతి) గాంధీ నగర్‌లో వున్న జమాతే ఇస్లామి హింద్ కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రహీం ఎన్నికయ్యారు. జమాతే సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మంగళవారం కమిటీ సభ్యులు సంయుక్తంగా రహీంను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా రిజ్వాన్, కార్యదర్శిగా అబ్దుల్‌హమీద్, కోశాధికారిగా మొహ్మద్ ఇబ్రహీం, షరీఫ్‌తోపాటు సభ్యులుగా సయ్యద్ మహబూబ్, మొహ్మద్ అరీఫ్, అబ్దురహ్మాన్, నియమితులయ్యారని నిర్వాహకులు తెలిపారు. మసీదు అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు

ఆలమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): కాపు టీచర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన అద్దరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షుడిగా అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా అడపా శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా అక్కిరెడ్డి సూర్యనారాయణ ఎన్నికైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్‌బాబు తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు శ్రీనివాసరావుతోపాటు సభ్యులను పలువురు అభినందించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా దివ్యశ్రీ

అంబాజీపేట, మే 13(ఆంధ్రజ్యోతి): ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా టి.దివ్యశ్రీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన వైద్యాధికారులు ఎ.ఇంద్రావతి, గీతాంజలిలు ఉన్నత చదువులు కోసం వెళ్లడంతో ఉన్నతాధికారులు దివ్యశ్రీని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిగా నియమించారు.

ప్రమాదభరితంగా మారిన బోడిపాలెం వంతెన

• భయాందోళన చెందుతున్న ప్రజలు, వాహనదారులు • అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై అసంతృప్తి



వంతెనకు ఒకవైపు దిగబడిపోయిన దృశ్యం

కపిలేశ్వరపురం, మే 13(ఆంధ్రజ్యోతి): కేదార్లంక గ్రామం నుంచి కొత్తపేటకు వెళ్లే బోడిపాలెం వంతెన ప్రమాదంగా మారింది. బ్రిటీష్ కాలంలో ప్రధాన పంటకాలువపై నిర్మించిన ఈ వంతెన శిథిలస్థితికి చేరుకున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వంతెన పైనుంచి కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాల ప్రజలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన పైనుంచి ధనమ్మమర్రికి వెళ్లే భక్తులు, వాహనదారులు వంతెన పరిస్థితిని చూసి బెంబేలెత్తుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్, వంతెన అడుగుభాగాన ఉన్న ఇనుపబద్దెలు తుప్పుపట్టి పాడైపోతున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. వంతెన అడుగుభాగాన స్లాబు పలుచోట్ల పెచ్చులూడిందని వారంటున్నారు. వంతెనకు ఇరువైపులా పలుచోట్ల కోతకు గురై దిగబడిపోయింది. అక్కడ తాత్కాలికంగా ఇనుపబద్దెలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల వంతెన రెయిలింగ్ దెబ్బతినడంతో ఆ ప్రాంతంలో తాత్కాలికంగా ఐరన్ నిచ్చెనలను ఏర్పాటు చేయడంతో ప్రమాద తీవ్రత సూచిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తు న్నారు. ఈ వంతెనకు ప్రతిపాదనలు పంపించడం, శాంక్షన్ రావడం, శంకుస్థాపన వరకు వచ్చి వెనక్కి వెళ్లిపోవడం వంటివి జరిగాయని స్థానికులంటున్నారు. ఈ వంతెన పైనుంచి భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదం పొంచి ఉందని ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు, వాహనాదారులు, ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని కోరుతున్నారు. అప్పటి వరకు తాత్కాలికంగా నైనా వంతెనకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెన రక్షణ గోడలు పడిపోకుండా ఏర్పాటు చేసిన ఇనుప బద్దెలు





ఆధునికీకరించిన జొన్నాడ హోమియో ఆసుపత్రి. పక్క చిత్రంలో మందులు అందిస్తున్న దాత

జొన్నాడ హోమియో ఆసుపత్రికి ఇద్దరు వైద్యులు

• మందులు అందించిన దాత • పూర్వపు వైభవం రావడంపై హర్షాతిరేకాలు • ఎమ్మెల్యే బండారు కృషిని అభినందిస్తున్న ప్రజలు

ఆలమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ హోమియోపతి ఆసుపత్రికి ఇద్దరు వైద్యులను నియమించడంతో పూర్వపు వైభవం సంతరించుకోనుంది. ఇక్కడ ఉన్న వైద్యులను బదిలీ చేయడంతో ఆసుపత్రికి కొత్తగా ఎవర్నీ నియమించకపోవడంతో కొన్నేళ్లుగా వైద్యసేవలు నిలిచిపోయాయి. హోమియో వైద్యం కోసం పలు గ్రామాల నుంచి రోజూ జొన్నాడకు పలువురు రోగులు వస్తుండేవారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రి దాదాపుగా మూతపడింది. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తాడి శ్రీనివాసరెడ్డి ఆసుపత్రిలో వైద్యుల విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించారు. ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని ఉన్నతాధికారులను కోరడంతో హోమియో వైద్యులు మిథున్, రవిరాజశేఖర్‌లను నియమించారు. ఆసుపత్రికి కావలసిన మందులను టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి కొనుగోలు చేసి వైద్యులకు అందజేశారు. వైద్యులు అందుబాటులో ఉండటంతో జొన్నాడ ఆసుపత్రిలో హోమియో వైద్యసేవలు పొందాలని వారు కోరుతున్నారు. ఆసుపత్రికి పూర్వపు వైభవం తీసుకొచ్చిన శ్రీనివాసరెడ్డి, వైద్యులను నియమించడానికి కృషి చేసిన ఎమ్మెల్యేను గ్రామస్తులతోపాటు పలువురు అభినందించారు.





ప్రత్యేక అలంకరణలో వెదురుపాక పోలేరమ్మ అమ్మవారు. పక్క చిత్రంలో పీఠంలో పోలేరమ్మ గరగలకు పూజలు చేస్తున్న దృశ్యం

వెదురుపాకలో ఘనంగా పోలేరమ్మ తీర్థం

రాయవరం, మే 13(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామస్తుల ఇలువేల్పు పోలేరమ్మ తీర్థాన్ని మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలేరమ్మ, బంగారమ్మ, కనకదుర్గ, మహాలక్ష్మి, దండిదుర్గమ్మ అమ్మవారు ప్రతిరూపాలైన గరగలను పుట్టింటికి తీసుకురాగా పుట్టింటివారు వడికట్టుకట్టి అమ్మవారికి పూజలు జరిపారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో గాడ్ కుమార్తెలు గాదే సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్య కనకదుర్గ, బలిజేపల్లి రమ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి వడికట్టు కట్టారు. తీర్థాన్ని పురస్కరించుకుని పోలేరమ్మ అమ్మవారితోపాటు పరివార దేవతలకు తమ గ్రామాన్ని పాడి పంటలతో చల్లగా చూడాలని భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సుందరంగా అలంకరించడంతో పాటు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన గరగనృత్యాలు, శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న వారిలో సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి, టీడీపీ నాయకులు కొవ్వూరి చంటిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులతో పాటు, కూటమి నేతలు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టేకుమూడి రాంబాబు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పళ్లాలమ్మ అమ్మవారు

ఘనంగా పళ్లాలమ్మ తీర్థం

కొత్తపేట, మే 13(ఆంధ్రజ్యోతి): వానపల్లి గ్రామదేవతగా ప్రసిద్ధి చెందిన పళ్లాలమ్మ తీర్థం మంగళవారం ప్రారంభమైంది. ఉభయ గోదావరి జిల్లాల భక్తజనం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలోని పలువురు ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. దేవాదయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. వేలాదిగా భక్తులు రావడంతో వానపల్లి నుంచి వాహనాలను వేరే మార్గంలో మళ్లించారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ సూచనలతో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కవి ఖ్వాజా మొహిద్దీన్‌కు సత్కారం

కొత్తపేట, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత సంబరాల్లో కొత్తపేటకు చెందిన ఉపాధ్యాయుడు, కవి, సామాజికవేత్త ఎండీ ఖ్వాజామొహిద్దీన్‌కు సత్కారం జరిగింది. సాహితీ సంబరాలలో మానవత్వానికి జాగలేని గాజా అంశంపై కవితా గానం చేసి ప్రసంసలు పొందారు. ఏలూరు మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో మొహిద్దీన్‌ను శ్రీశ్రీకళావేదిక సత్కరించింది. కార్యక్రమంలో కవి ప్రముఖులు కె.ప్రతాప్, కొల్లి రమాదేవి, జి.ఈశ్వరిదేవి, డాక్టర్ పి.పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న దృశ్యం



టైక్వాండో పోటీల్లో విజయం సాధించిన ఆలమూరు విద్యార్థులు

జిల్లాస్థాయి టైక్వాండో పోటీల్లో
విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో పిఠాపురంలో నిర్వహించిన టైక్వాండో పోటీల్లో ఆలమూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. బహుమతులు సాధించిన వివరాలను కోచ్ టి.అబ్బులు మంగళవారం తెలిపారు. సీనియర్స్ విభాగంలో బుంగ అశ్విన్ గోల్డ్‌మెడల్, బి విభాగంలో గెద్దాడ నిఖిల్ సిల్వర్ మెడల్ సాధించగా సీనియర్ బాలికల విభాగంలో ఫూమ్స్ ఏ విభాగంలో తాతపూడి ఐశ్వర్య గోల్డ్‌మెడల్, బి విభాగంలో గొల్లపల్లి చంద్రిక గోల్డ్‌మెడల్ సాధించారు. జూనియర్ బాలికల విభాగంలో గెద్దాడ హర్షిణి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు అబ్బులు తెలిపారు.





వాటర్ వర్క్స్‌లో మూలనపడి వున్న తడి,పొడి చెత్తను వేరుచేసే ప్లాస్టిక్ డబ్బాలు. పక్క చిత్రంలో మరమ్మతులకు గురై మూలకు చేరిన రహదారులను శుభ్రం చేసే యంత్రం

ఇలా వృథాగా పడి ఉండాల్సిందేనా?

• కదలని స్వచ్ఛ సర్వేక్షణ్ వాహనాలు • పట్టించుకోని వాటర్‌వర్క్స్ అధికారులు

మండపేట, మే 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వాటర్ వర్క్స్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ వాహనాలు మూలకు చేరాయి. పట్టణంలోని రహదారులు శుభ్రం చేసే యంత్రంతోపాటు డ్రైన్లలో పూడిక తీసే మినీ జేసీబీలు మూలకు చేరాయి. వీటికి డ్రైవర్ లేకపోవటంతోపాటు యంత్రాల మరమ్మతులకు గురవటంతో చాలాకాలం నుంచి కదలడం లేదు. మరోపక్క వార్డుల్లో తడి,పొడి చెత్త వేసేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించిన ప్లాస్టిక్ డబ్బాలు కూడా మూలకు చేరాయి. వీధుల్లో పెట్టిన సమయంలో ఇళ్లల్లో వచ్చే కూరగాయల వ్యర్థాలు తడి,పొడి చెత్త వేరుచేసి వేసేలా వీటిని ఉపయోగించాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల మున్సిపల్ వాటర్ వర్క్స్‌లో వృథాగా పడి ఉండటంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూలకు చేరిన స్వచ్ఛ సర్వేక్షణ్ యంత్రాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు సూచిస్తున్నారు. చెత్తను సేకరించేందుకు దాతలు అందించిన చెత్త డబ్బాలు వినియోగంలోకి తీసుకువచ్చి పట్టణాన్ని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి పట్టణవాసులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, మే 13(ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంక గోదావరి లంకలో సారాకు సిద్ధంగా ఉన్న 1000 లీటర్ల బెల్లపు ఊటను ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు, స్క్వాడ్ సీఐ ఎల్.చిరంజీవి ఈ దాడుల్లో పాల్గొన్నారు. పేరవరం గ్రామానికి చెందిన 8 మందిని సారా కేసులో బైండోవర్ చేసి తహశీల్దారు కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.